# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 86 | విశాఖపట్నం | 26-12-2025 శుక్రవారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 86 | VISAKHAPATNAM | 26-12-2025 FRIDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



## రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్ — PATHAKAM NEWS TELEGU DAILY — తెలుగు దినపత్రిక

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


## వాజ్‌పేయి చూపిన మార్గంలోనే

# అభివృద్ధి: చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** ఈరోజు ఒక చరిత్ర.. ఒక యుగ పురుషుడు పుట్టిన రోజు అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గురువారం నాడు అటల్ – మోడీ సుపరిపాలన యాత్ర ముగింపు సభలో సీఎం మాట్లాడుతూ.. శత జయంతి ఉత్సవాలను జరుపుకుంటున్నరోజును.. ప్రజా రాజధాని, దేవతల రాజధాని అమరావతిలో జరుపుకోవడం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. దేవతల రాజధాని ఏ విధంగా ఉందో ఊహించుకుంటున్నారన్నారు. అమరావతిని ప్రపంచం మొత్తం గుర్తు పెట్టుకునేలా చేయడమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ ప్రాంత రైతులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని.. ప్రపంచంలో ఎక్కడా జరగని విధంగా 33వేల ఎకరాల భూమిని 29వేల మంది రైతులు ఒక్క రూపాయి తీసుకోకుండా ఇచ్చారని తెలిపారు. అటువంటి స్ఫూర్తిని ఇచ్చిన రైతులకు శిరస్సు వంచి నమస్కారాలు తెలియచేస్తున్నట్లు చెప్పారు. అమరావతిలో ఒక చరిత్రను సృష్టించే విధంగా వాజ్‌పేయి విగ్రహం ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఈనెల 11 నుంచి అటల్ మోదీ సురిపాల యాత్రను ప్రారంభించారని తెలిపారు. అమరావతిలో 14 అడుగుల వాజ్‌పేయ్ విగ్రహాన్ని ఆవిష్కరించామని సీఎం తెలిపారు. శాశ్వతంగా ప్రజలకు గుర్తుండిపోయేలా ఈ స్మృతి వనాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. దేశానికి సుపరిపాల యాత్రను పరిచయం చేసిన వ్యక్తి వాజ్‌పేయి అని.. అందుకే మోదీ డిసెంబర్ 25న గుడ్ గవర్నెన్స్ డేగా ప్రకటించారన్నారు. ఆరోజు వాజ్‌పేయి, నేడు మోదీ విలక్షణమైన వ్యక్తిత్వం, చరిత్రను తిరగరాసే నాయకత్వం వారిలో ఉందని చెప్పుకొచ్చారు. తనకు ఎప్పుడూ స్ఫూర్తిని ఇచ్చే నేత ఎన్టీఆర్ అని అన్నారు. దేశంలో యాంటీ కాంగ్రెస్ కోసం పని చేసిన నేతలు వాజ్‌పేయి, ఆ తర్వాత ఎన్టీఆర్ మాత్రమే అని తెలిపారు. ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని నాడు కుట్రతో కూలిస్తే.. అండగా నిలబడిన వ్యక్తులు వాజ్‌పేయి, అద్వానీ మాత్రమే అని గుర్తుచేశారు. నేషనల్ ఫ్రంట్ పెట్టి చైర్మన్‌గా వాజ్‌పేయికు సహకరించిన వ్యక్తి ఎన్టీఆర్ అని గుర్తుచేశారు. డిసెంబర్ 25న గ్వాలియర్‌లో సామాన్య కుటుంబంలో వాజ్‌పేయి పుట్టారని.. జనసంఘ్ బీజేపీ నుంచి 10 సార్లు ఎంపీ, రెండుసార్లు రాజ్యసభకు ఎంపిక అయ్యారని తెలిపారు. మంచి వక్తతో పాటు, అద్భుతమైన కవి, మానవతావాది వాజ్‌పేయి అని అన్నారు. (తరువాయి 2వ పేజీలో)

ఆర్టికల్ 370 రద్దుతో శ్యామ్‌ప్రసాద్ కల

# సాకారం చేశాం: మోడీ



**లక్నో, పతాకం న్యూస్:** ర్టికల్ 370 రద్దుతో శ్యామ్‌ప్రసాద్ కల సాకారం చేశామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. జమ్మూకాశ్మీర్‌లో భారత రాజ్యాంగం అమలు చేశామని చెప్పారు. గురువారం ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నోలో జరిగిన భారతరత్న, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి 101వ జయంతి కార్యక్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ మధ్యాహ్నం సుమారు 2:30 గంటలకు ఆయన గోమ్తీ నది ఒడ్డున నిర్మించిన రాష్ట్ర ప్రేరణా స్థల్‌ను జాతికి అంకితం చేశారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. 'కోట్లాదిమందిని పేదరికం నుంచి విముక్తి చేశాం. గతంలో ఒకే కుటుంబం పేరుతో పథకాలు అమలుచేశారు. వాజ్‌పేయి హయాంలోనే గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి బీజం పడింది. 2014 నుంచి గ్రామాల్లో 4 లక్షల కి.మీ. రోడ్ల నిర్మాణం జరిగింది. దేశంలో ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణం మరింత పుంజుకుంది. వాజ్‌పేయి హయాంలోనే ఢిల్లీ మెట్రో ప్రారంభమైంది. భవిష్యత్‌లో అతిపెద్ద మొబైల్ ఫోన్ల ఉత్పత్తి దేశంగా భారత్ మారనుంది. అందరి కృషితోనే వికసిత్ భారత్ సాకారం అవుతుంది. లక్నోలో అతిపెద్ద డిఫెన్స్ కారిడార్ ఉంది. బ్రహ్మోస్ క్షిపణులు లక్నోలోనే తయారవుతున్నాయి. మన బ్రహ్మోస్ క్షిపణుల సామర్థ్యం ప్రపంచమంతా చూసింది. మొబైల్, ఇంటర్నెట్ వినియోగించే దేశాల్లో భారత్‌దే అగ్రస్థానం' అని అన్నారు. కాగా, సుమారు 65 ఎకరాల విస్తీర్ణంలో 230 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మితమైన రాష్ట్ర ప్రేరణా స్థల్ జాతీయ స్మారక సముదాయంలో అటల్ బిహారీ వాజ్‌పేయితో పాటు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయల ఆదర్శాలకు అనుగుణంగా వారి విగ్రహాలు ఏర్పాటు చేశారు.

## రాష్ట్ర వ్యాప్తంగా క్రిస్మస్ సందడి

### క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు



**అమరావతి, పతాకం న్యూస్:** ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మంది సంబరం చేసుకునే రోజు రానే వచ్చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలూ, చర్చి గంటలూ, వెలిగే కొవ్వొత్తులూ, మెరిసే నక్షత్రకాంతులూ, విద్యుద్దీపాలంకరణలూ, ప్లమ్ కేకులూ, పుడ్డింగులూ, ఫర్ చెట్లూ, కానుకల్ని పంచే శాంటా క్లాజ్ వేషధారణలతో సందడి చేశారు.




## నిషేధిత భూముల సమస్యల పరిష్కారానికి చొరవ ఏదీ?




**అమరావతి, పతాకం న్యూస్:** విద్యుత్తు సరఫరా నెట్‌వర్క్‌లో కీలక టవర్లకు కూడా భద్రత కరవైంది. మట్టి మాఫియా ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. టవర్లను ఆనుకుని ఉన్న మట్టిని విచ్చలవిడిగా తవ్వేస్తోంది. టవర్ కారిడార్‌కు ఇరువైపులా ఎలాంటి నిర్మాణాలు, తవ్వకాలు జరపకూడదన్న నిబంధనలు ఉన్నాయి. ఇవేవి మాఫియాకు పట్టలేదు. విద్యుత్తు చట్టంలో స్పష్టంగా పేర్కొన్న అంశాలను కూడా లెక్క చేయడం లేదు. ఇక మారుమూల ప్రాంతాల్లో అయితే యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతోంది. దీనివల్ల లోతైన గుంతలు ఏర్పడుతున్నాయి. వర్షాలకు నీరు నిలిచి పోతోంది. అక్కడ నేల దెబ్బ తింది. దీంతో బలమైన గాలులు వీస్తే టవర్లు కూలిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇలా జరిగితే లైన్లలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. దక్షిణాది గ్రిడ్‌కే ప్రమాదం తలెత్తే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలో వివిధ సంస్థలు ఉత్పత్తి చేసిన విద్యుత్తు జాతీయ గ్రిడ్‌కు అనుసంధానం చేయాలనే యోచనలో ఉన్నాయి. ఇందుకుగానూ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ ట్రాన్స్‌కో, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (PGCIL) 765 కె.వి., 400 కె.వి., 220 కె.వి. నెట్‌వర్క్ వినియోగించుకుంటాయి. ఇప్పటికే కొన్ని ప్రైవేటు సంస్థలు విద్యుత్తు సంస్కరణల నేపథ్యంలో సరఫరా నెట్‌వర్క్‌ను కూడా అభివృద్ధి చేశాయి. ఈ లైన్లు మొత్తం జాతీయ గ్రిడ్‌కు అనుసంధానం అవుతాయి. ఇందుకుగానూ 400/220/132 కె.వి. లైన్లు ఏర్పాటు చేయనున్నాయి. వీటి కోసం 40 నుంచి 50 మీటర్ల ఎత్తు టవర్లను విద్యుత్ సంస్థలు ఏర్పాటు చేస్తాయి. ఒక్కొక్క టవర్ సుమారు 100 టన్నుల బరువు ఉంటుంది. ఆ టవర్లు దెబ్బ తినకుండా, గాలులకు పడిపోకుండా భూమి లోపల సుమారు 3.5 మీటర్లు ఫౌండేషన్ ఏర్పాటు చేస్తారు. ట్రాన్స్‌కో పరిధిలో సుమారు 31,000 సర్క్యూట్ కిలోమీటర్లలో లైన్లు ఉన్నాయి. వీటి కోసం 12 రకాల భద్రత అంశాలను ప్రత్యేక బృందం పరిశీలిస్తుంది. రైల్వే లైన్లు, హైవే క్రాసింగ్, నదుల పై భాగం నుంచి వెళ్లే లైన్లను అత్యంత సెన్సిటివ్‌గా గుర్తిస్తాయి. అక్కడ ప్రతినెలా తనిఖీలు నిర్వహించాలి. ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన లైన్లను మూడు, ఆరు నెలలకు ఒకసారి పెట్రోలింగ్ నిర్వహిస్తాయి.

విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేసిన ప్రాంతానికి ఇరువైపులా రైట్ ఆఫ్ వే (ROW) కారిడార్‌గా విద్యుత్ సంస్థలు గుర్తిస్తాయి. టవర్ నుంచి గరిష్ఠంగా 52 మీటర్లు, కనిష్ఠంగా 27 మీటర్ల పరిధిని ఆర్‌వోడబ్ల్యూ ప్రాంతంగా నిర్ణయిస్తాయి. లైన్ల ఏర్పాటు కోసం భూ సేకరణ జరుపుతాయి. (తరువాయి 2వ పేజీలో)



## 250 పైగా రెన్యూవల్స్ ఫైల్స్ పెండింగ్ అంట!!

- ఔషధ నియంత్రణ శాఖ విశాఖలో అవినీతి కంపు!
- వందలకు పైగా రెన్యువల్ చేయని ఔషధ నియంత్రణ అధికారులు
- అనకాపల్లి జిలాలో 1049 మెడికల్ షాపులు
- అల్లూరి సీతారామరాజు జిల్లాలో 300 మెడికల్ షాపులు
- విశాఖ సిటీ పరిధిలో 3000 మెడికల్ షాపులు
- కనీ,విని,ఎరిగనీ రీతులో, ఎప్పుడూ చూడని రీతులో డ్రగ్ అధికారులు చేతివాటం!!
- ఔషధ నియంత్రణ శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆడింది ఆట పాడింది పాట అనే చందంగా మార్చేశారు అంట
- మహిళా ఉద్యోగులపై వేధింపులు దారుణంగా ఉంటాయంట!!
- మహిళా ఉద్యోగులు ఎవరికి చెప్పాలో తెలియక మింగలేక చావలేక బ్రతుకుతున్న పరిస్థితి అంట! ఔషధ నియంత్రణ శాఖలో పెద్ద అధికారి ఆగడాలు
- అయోమయంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల పరిస్థితి అంట
- అసిస్టెంట్ డైరెక్టర్, పై హోదాలో ఉన్న డిడి మహిళా ఉద్యోగికి తెలియకుండా నొక్కి పెడుతున్న రెన్యువల్ ఫైల్స్

**ఔషధ నియంత్రణ శాఖలో జరిగిన అవినీతి అక్రమాలు, మహిళా ఉద్యోగులపై వేధింపులు, మెడికల్ షాపులు యజమానులను భయపించి, నగదు ఇవ్వకపోతే మెడిసిన్ రూపంలో దోచుకున్న అసిస్టెంట్ డైరెక్టర్ ఆగడాలు రేపటి సంచికలో..**

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# పీడీ చట్టం

గంజాయి గూండాల నుండి రౌడీషీటర్ల వరకు రాష్ట్రంలో ఒకవైపు చెలరేగిపోతున్నా ఏమాత్రం పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే సిపిఎం నేత అప్పలరాజుపై పిడి యాక్టు బనాయిరచి అరెస్ట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో గత దశాబ్ధ కాలంలో రాష్ట్రంలో నిర్బంధ చట్టాల అమలు తీరుపై క్లుప్తంగా : రాష్ట్రంలో రెండు రకాల నిర్బంధ చట్టాలు అమలులో ఉన్నాయి. వీటిలో మొదటిది, ఆంధ్రప్రదేశ్ ప్రమాదకర కార్యకలాపాల నివారణ చట్టం (ప్రివెన్షన్ ఆఫ్ డేంజరస్ యాక్టివిటీస్ యాక్ట్ %-% పిడి యాక్ట్) దీనిని గూండా చట్టంగా కూడా పిలుస్తారు. 1986లో అమలులోకి వచ్చింది. ఈ చట్టం పరిధి విస్తృతంగా ఉంది. దొంగలు, మాదకద్రవ్య నేరస్తులు, గూండాలు, అక్రమ వ్యాపారాలు నిర్వహించేవారు, భూకబ్జాదారుల నుండి నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల విక్రేతలు ఆహార పదార్థాల కల్తీదారులు ఈ చట్ట పరిధిలోకి వస్తారు. అదే విధంగా నకిలీ పత్రాల తయారీదారులు, నిత్యావసర వస్తువులకు సంబంధించి నేరాలు చేసేవారు, అటవీ నేరస్తులు, జూదగాళ్లు, లైంగిక నేరస్తులు, అక్రమంగా పేలుడు పదార్థాలు తయారు చేసేవారు. అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్న వారు, సైబర్ నేరస్తులు, వైట్ కాలర్, ఆర్థిక నేరస్తులను కూడా ఈ చట్టం పరిధిలోకి తీసుకువచ్చారు. రెండవది 1980వసంవత్సరం నాటి జాతీయ భద్రతా చట్టం(ఎన్ఎస్ఎ). దీనిని కూడా రాష్ట్ర ప్రభుత్వం వినియోగించింది.గత పదేళ్ల కాలాన్ని రాష్ట్రంలో రెండు రాజకీయ దశలుగా విభజించవచ్చు. సమైక్యరాష్ట్ర విభజన అనంతర కాలం (2014-2019). మొదటిది. 2014 జూన్ 2న సమైక్య రాష్ట్రం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌గా విడిపోయింది. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటైంది. కొన్ని నెలల పాటు ఎపి పిడి చట్టం రెండు రాష్ట్రాలకు వర్తించింది. ఆ తరువాత తెలంగాణ తన సొంత చట్టాన్ని రూపొందించుకుంది. ఈ కాలంలో దీనిని చట్ట నిర్వచనానికి మించి అనేక కేసుల్లో వినియోగించారు. భూవివాదాలు, చిన్నచిన్న నేరాలతో పాటు ముఖ్యంగా రాజకీయ ప్రత్యర్థులకు సంబంధించిన కేసులకూ ఈ చట్టాన్ని వర్తింపజేశారు. అనేక సందర్భాలలో హైకోర్టు, సుప్రీంకోర్టులు జోక్యం చేసుకోవాల్సివచ్చింది. ఈ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తాయి. కొన్ని సందర్భాలలో న్యాయమూర్తులు సైతం ఇటువంటి వ్యాఖ్యలు చేశారు. 2019-24 మధ్య కాలంలో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కొనసాగింది. ఈ కాలంలో నిర్బంధ చట్టాల వినియోగం గణనీయంగా పెరిగింది. జాతీయ స్థాయిలోనూ ఇది తీవ్ర చర్చకు దారి తీసింది. ఎన్‌సిఆర్‌బి గణాంకాల ప్రకారం గూండా చట్టం కింద రాష్ట్రంలోనే ఎక్కువ కేసులు నమోదయ్యాయి. 2019-24 మధ్య వేల సంఖ్యలో నిర్బంధ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వైసిపి ప్రభుత్వం ఈ చట్టాన్ని ప్రతిపక్షాలపై విస్తృతంగా ప్రయోగిస్తోందన్న విమర్శలు వచ్చాయి. సోషల్ మీడియా నేరాల విషయంలోనూ గూండా చట్టంలోని "సైబర్ క్రైమ్ నేరస్తులు" అనే పదాన్ని పెద్దఎత్తున వినియోగించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫేస్‌బుక్, యూ ట్యూబ్‌లలో పోస్టులు పెట్టిన వారిపై కేసులు పెట్టారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పి.కె మిశ్రా (అనంతర కాలంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి) నేత త్వంలోని ధర్మాసనం నిర్బంధ చట్టాల అమలుపై అనేక కీలక తీర్పులు వెలువరించింది. గోపాల కృష్ణన్ అలియాస్ నకుల్ వర్సెస్ ఆంధ్రప్రదేశ్ కేసులో గూండా చట్టాన్ని 'కఠినమైన, దారుణమైన చట్టం'గా పేర్కొంది. చట్ట దుర్వినియోగం ఆందోళనకరంగా మారిందని వ్యాఖ్యానించింది. సాధారణ నేరాలను ఐపిసి, సిఆర్‌పిసి విచారించవచ్చని, దానికి భిన్నంగా గూండా చట్టాన్ని వాడటం చట్టాన్ని దుర్వినియోగం చేయుటమేనని పేర్కొంది. మరో కేసులో, విచారణ లేకుండానే వ్యక్తిని శాశ్వత నిర్బంధంలో ఉంచే సాధనంగా ఈ చట్టాన్ని వాడుతున్నారని కోర్టు వ్యాఖ్యానించింది. సోషల్ మీడియా పోస్టులు ఎంత అభ్యంతరకరంగా ఉన్నా, అవి సాధారణ ప్రజా శాంతికి తీవ్రముప్పుగా పరిగణించలేమని పేర్కొంది. ఐటి చట్టం, ఐపిసి వంటి సాధారణ చట్టాలే ఈ నేరాలకు సరిపోతాయని పేర్కొంది.ఈ కాలంలో హైకోర్టు వందల సంఖ్యలో నిర్బంధ ఉత్తర్వులను రద్దు చేసింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తన చర్యలను కోర్టుల్లో సమర్థించుకుంది. సైబర్ బుల్లీయింగ్, తప్పుడు వార్తలు, పరువు నష్టం కలిగించే ప్రచారాలను అరికట్టాల్సిన అవసరం ఉందని, అవి హింసకు దారితీయవచ్చని వాదించింది. మొత్తం మీద రాష్ట్రంలో గత దశాబ్ధ కాలంలో నిర్బంధ చట్టాల అమలు పెరిగింది. దీనిని న్యాయస్థానాలు కొంత మేర అడ్డు కునే ప్రయత్నం చేశాయి. తాజాగా తెలుగుదేశం ప్రభుత్వం ప్రజా ఉద్యమకారునిపై పిడి చట్టాన్ని బనాయించింది.

### ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ఢీకొన్న లారీ..

# 13 మంది సజీవ దహనం



**కర్ణాటక, పతాకం న్యూస్:** కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న ట్రావెల్స్ బస్సును కంటైనర్ లారీ ఢీకొట్టింది. బస్సు డీజిల్ ట్యాంక్ వద్దే లారీ ఢీకొనడంతో వెంటనే మంటలు చెలరేగాయి. దీంతో బస్సులో 9 మంది సజీవ దహనమయ్యారు. వారంత వెనుక భాగంలో ఉన్నవారే. సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, చిత్రదుర్గం జిల్లా జవరగుండనహళ్లి శివారులోని సిరా-హిరియూరు మధ్య జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున ప్రమాదం జరిగింది. బెంగళూరు నుంచి గోకర్ణం వెళ్తోంది ప్రైవేటు ట్రావెల్ బస్సు. ప్రమాదానికి గురైన వాహనాన్ని సీబర్డ్ ట్రావెల్స్ బస్సుగా గుర్తించారు. ప్రమాదం తర్వాత కంటైనర్ లారీ, బస్సు రెండూ మంటల్లో చిక్కుకున్నాయి. బస్సు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద సమయంలో బస్సులో 32 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదంలో గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రులకు తరలించారు పోలీసులు, అధికారులు. సిరా, హిరియూరులోని ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన గురించి తూర్పు జోన్ ఐజీపీ రవికాంతే గౌడ మీడియాతో మాట్లాడారు. "బెంగళూరు నుండి గోకర్ణ వెళ్తున్న ప్రైవేట్ స్లీపర్ బస్సును తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీ ఢీకొట్టింది. లారీ బస్సు డీజిల్ ట్యాంక్‌ను ఢీకొట్టి ఉండవచ్చు. దీని వల్ల డీజిల్ లీక్ అయి మంటలు చెలరేగి ఉండవచ్చు. బస్సులోని కొంతమంది ప్రయాణికులు వెంటనే బయటకు వచ్చారు. లోపల ఉన్న ఎనిమిది మంది, లారీ డ్రైవర్ సహా మొత్తం తొమ్మిది మంది మరణించారని ప్రాథమిక దర్యాప్తులో తేలింది" అని తెలిపారు. "గాయపడిన 12 మంది హిరియూర్ ఆసుపత్రిలో, 9 మంది సిరా ఆసుపత్రిలో, ముగ్గురు తుమకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తీవ్రంగా కాలిన గాయాలతో బెంగళూరులోని విక్టోరియా ఆసుపత్రికి ఒక ప్రయాణికుడిని తరలించారు. విక్టోరియా ఆసుపత్రికి తరలించిన ప్రయాణికుడితో పాటు, మొత్తం 24 మంది సురక్షితంగా బయటపడ్డారు. బస్సులో ఉన్న 32 మందిలో, ఒక చిన్నారి సహా 8 మంది చనిపోయిన వారిలో ఉన్నారని తెలిసింది. మృతుల పరీక్షలు నిర్వహించిన తర్వాత మృతదేహాలను అప్పగిస్తాం" అని ఆయన చెప్పారు. అదనపు డిప్యూటీ కమిషనర్ కుమారస్వామి బి.టి. మాట్లాడుతూ "బెంగళూరు నుంచి గోకర్ణకు వెళ్తున్న ప్రైవేట్ బస్సు రాత్రి ప్రమాదానికి గురైంది. ఎదురుగా వస్తున్న లారీ బస్సును ఢీకొట్టడంతో ప్రమాదం జరిగి మంటలు చెలరేగాయి. ఈ సంఘటనలో లారీ డ్రైవర్ కూడా మరణించగా, అతడి మృతదేహాన్ని ఆసుపత్రి మార్చురీకి తరలించాం. గాయపడిన 12 మందిని హిరియూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. 9 మందిని తుమకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బస్సులో 30 మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఇది జరిగింది. మృతదేహాలను గుర్తించే పని చేయాల్సి ఉంది. ఎంత మంది చనిపోయారో ఇంకా తెలియాల్సి ఉంది" అని తెలిపారు.

## క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మోడీ




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** గురువారం క్రిస్మస్ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఢిల్లీలోని కేథడ్రల్ చర్చ్ ఆఫ్ ది రిడంప్షన్‌లో ఉదయపు ప్రార్థనా సర్వీస్‌లో పాల్గొన్నారు. ఢిల్లీ, ఉత్తర భారత క్రైస్తవ సమాజం పెద్ద సంఖ్యలో హాజరైన ఈ కార్యక్రమంలో ప్రార్థనలు, సాంప్రదాయ క్యారల్స్, హిమ్స్‌లతో సందడి వాతావరణం నెలకొంది. ఢిల్లీ బిషప్ ఆర్‌టి. రెవ. డాక్టర్ పాల్ స్వరూప్ ప్రధానికి ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ, 'ఢిల్లీలోని కేథడ్రల్ చర్చ్ ఆఫ్ ది రిడంప్షన్‌లో క్రిస్మస్ ఉదయ సర్వీస్‌లో పాల్గొన్నాను. ఈ సర్వీస్ ప్రేమ, శాంతి, కరుణ యొక్క శాశ్వత సందేశాన్ని ప్రతిబింబిస్తుంది. క్రిస్మస్ స్ఫూర్తి మన సమాజంలో సామరస్యం, మంచితనాన్ని ప్రేరేపించాలి' అని తెలిపారు. దేశ ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన మోదీ, ఈ పండుగ స్ఫూర్తి సమాజంలో ఐక్యతను బలోపేతం చేయాలని కోరారు. యేసు క్రీస్తు బోధనలైన ప్రేమ, శాంతి, కరుణలను జ్ఞాపకం చేస్తూ, సమాజంలో సామరస్యం, పరస్పర గౌరవాన్ని ప్రోత్సహించేలా ఈ కార్యక్రమం నిర్వహించారు. భారత వైవిధ్యభరిత మత సంప్రదాయాలకు గౌరవం చూపుతూ ఈ వేడుకలు జరిగాయి. గత కొన్ని సంవత్సరాలుగా ప్రధాని మోడీ క్రైస్తవ సమాజ కార్యక్రమాల్లో క్రియాశీలంగా పాల్గొంటున్నారు. 2023లో ఈస్టర్ సందర్భంగా సేక్రెడ్ హార్ట్ కేథడ్రల్‌లో నిర్వహించిన ప్రార్థనకు మోడీ హాజరయ్యారు.

# మట్టి మాఫీయా

(మొదటిపేజీ తరువాయి)

ఆ సమయంలోనే ఆ ప్రాంతానికి పరిహారాన్ని కూడా చెల్లిస్తాయి. విద్యుత్తు చట్టంలో ఆ పరిధిలో ఎలాంటి తవ్వకాలు, నిర్మాణాలు జరపకూడదని స్పష్టంగా పేర్కొంది. దెబ్బతిన్న టవర్‌ను పునరుద్ధరించాలి అంటే కనీసం నెల రోజులు పడుతుందని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టవర్ల తనిఖీలకు ప్రత్యేక అధికారులు బృందాలు ఏర్పాటు చేశామని ట్రాన్స్‌కోకు చెందిన ఒక అధికారి తెలిపారు. టవర్ల వెంట ఎలాంటి తవ్వకాలు జరపకుండా బృందాలు పర్యవేక్షిస్తాయి అన్నారు. అయినా, చాలా చోట్ల మాకు తెలియకుండా తవ్వేస్తున్నారు అని పేర్కొన్నారు.

## చంద్రబాబు నివాసానికి కేంద్రమంత్రి శివరాజ్ సింగ్



**అమరావతి, పతాకం న్యూస్:** సీఎం చంద్రబాబు నివాసానికి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ గురువారం ఉదయం చేరుకున్నారు. ముఖ్యమంత్రి ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు కలిసి అల్పాహార విందులో పాల్గొన్నారు. కాసేపట్లో ఇద్దరూ కలిసి రాజధాని అమరావతికి బయలుదేరనున్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతిని పురస్కరించుకుని అమరావతిలోని వెంకటపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన 12 అడుగుల కాంస్య విగ్రహాన్ని సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆవిష్కరించనున్నారు. వాజ్‌పేయి పేరుతో ఏర్పాటు చేస్తున్న 'స్మృతి వనం'ను కూడా వారు ప్రారంభించనున్నారు. ఈ స్మృతి వనం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే భూమిని కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమం, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నేతృత్వంలో జరిగిన 'అటల్ మోదీ సుపరిపాలన యాత్ర' ముగింపు సభగా జరగనుంది. ఈ నెల 11న ధర్మవరంలో ప్రారంభమైన ఈ యాత్ర రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో కొనసాగింది. నేడు అమరావతిలో జరిగే ముగింపు సభలో సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, పీవీఎన్ మాధవ్ ప్రసంగించనున్నారు.

## పులివెందుల చర్చిలో జగన్ కుటుంబం ప్రత్యేక ప్రార్థనలు



**పులివెందుల, పతాకం న్యూస్:** క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని వైసీపీ అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన కుటుంబ సభ్యులతో కలిసి పులివెందులలో సందడి చేశారు. గురువారం ఉదయం స్థానిక సీఎస్ఐ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. పులివెందుల పర్యటనలో భాగంగా జగన్ తన తల్లి వైఎస్ విజయమ్మ, భార్య వైఎస్ భారతి రెడ్డితో కలిసి చర్చికి చేరుకున్నారు. వారితో పాటు మరి కొందరు కుటుంబ సభ్యులు కూడా ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం జగన్ చర్చి వెలుపల వేచి ఉన్న అభిమానులు, స్థానికులకు అభివాదం చేస్తూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. జగన్ పర్యటన సందర్భంగా పులివెందులకు వైసీపీ కార్యకర్తలు, నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. చర్చి పరిసరాల్లో పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

(మొదటిపేజీ తరువాయి)

# అభివృద్ధి: చంద్రబాబు

ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు తాను చాలా సన్నిహితంగా ఉన్నానని.. అటల్ పని చేసే ఆలోచనలు బాగా తెలిసిన వ్యక్తిని తానే అని తెలిపారు. దేశ ప్రగతికి గట్టి పునాది వేసిన వ్యక్తి వాజ్‌పేయి అని అన్నారు. మనం జాతీయ రహదారులపై తిరుగుతున్నామంటే ఆద్యుడు వాజ్‌పేయి అని కొనియాడారు. పీపీపీ విధానంలో దేశం అభివృద్ధి చెందుతుందని ఆలోచించి.. ఆచరణలో పెట్టిన వ్యక్తి వాజ్‌పేయి అని సీఎం వెల్లడించారు. రోడ్లు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, మౌలిక వసతులు కల్పన వంటివి ఏర్పాటు చేసి సంపదను సృష్టించిన వ్యక్తి వాజ్‌పేయి అని తెలిపారు. విమానాల గురించి అడిగితే వెంటనే అనుమతులు ఇచ్చారని.. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు హైదరాబాద్‌లో వచ్చిందంటే అటల్ జీ కారణమన్నారు. దేశంలో లక్షా 46వేల కిలోమీటర్లు జాతీయ రహదారుల నిర్మాణం ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. ఆరోజు అణు పరీక్షలు చేస్తే డబ్బులు ఇవ్వమని అమెరికా ఆంక్షలు పెడితే.. తనకు దేశం ముఖ్యమని అణుపరీక్షలు చేసిన వ్యక్తి వాజ్‌పేయి అని వెల్లడించారు. నాడు వాజ్‌పేయి కార్గిల్ యుద్ధం.. నేడు మోదీ ఆపరేషన్ సింధూర్ చరిత్రలో మిగిలిపోతాయన్నారు. దేశం జోలికి వస్తే ఖబడ్దార్ అని నిరూపించిన నాయకులు వాజ్‌పేయి, నరేంద్ర మోదీ అని పేర్కొన్నారు. కొంతమంది నాయకులు శాశ్వతంగా స్ఫూర్తిని ఇస్తారని.... దేశం కోసం బతుకుతారని, దేశం కోసం ఆలోచిస్తారన్నారు. మరికొంత మంది నాయకులు మాత్రం స్వార్థం కోసమే ఆలోచిస్తారని.... స్వార్థం కోసమే పని చేస్తారని విమర్శించారు. ఈ భారతదేశం ఉన్నంత కాలం భారతీయుల గుండెల్లో ఉండే వ్యక్తి వాజ్‌పేయి అని స్పష్టం చేశారు. అందుకే అమరావతిలో విగ్రహం, స్మృతి వనం పెట్టుకున్నామని వివరించారు. ఆయన చూపిన మార్గంలో పయనిస్తూ అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఎన్టీఆర్, వాజ్‌పేయి చేసిన సేవలు గుర్తుండిపోయేలా ఎన్డీఏ ప్రభుత్వం కార్యక్రమాలు చేస్తుందని వెల్లడించారు. ప్రపంచంలో భారత్ దేశం 11వ స్థానంలో ఉంటే... మోదీ సారథ్యంలో నాలుగో స్థానంలోకి తెచ్చారన్నారు. 2047 నాటికి భారతదేశం ప్రపంచంలో నెంబర్ వన్ దేశంగా తయారు అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆ సత్తా, ఆ శక్తి నరేంద్ర మోదీకి ఉందన్నారు. ఆరోజు వాజ్‌పేయి, ఎన్టీఆర్... దేశం కోసం ఆలోచించారని, తెలుగు జాతీ కోసం ఆలోచన చేశారని.. నేడు మోదీ, తాను కలిసి దేశాన్ని, రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపే బాధ్యత తీసుకుంటున్నామని తెలిపారు.అమరావతిలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని.. ఇంకా గేర్ పెంచుతామన్నారు. ఐటీకి సంబంధించి సైబరాబాద్‌లో హైటెక్ సిటీని ఓపెన్ చేసిన వ్యక్తి వాజ్‌పేయి అని తెలిపారు. నేడు అమరావతిలో క్వాంటమ్ బిల్డింగ్‌ను త్వరలోనే ఓపెన్ చేసుకోబోతున్నామని చెప్పారు. అమరావతి, పోలవరం, విశాఖ స్టీల్ ప్లాంట్, అభివృద్ధికి మోదీ పూర్తిగా సహకారం అందిస్తున్నారని చెప్పారు. మొన్నటి వరకు వెంటిలేటర్‌పై ఉన్న ఏపీ.. ఇప్పుడు తిరిగి కోలుకుని, నిలబడే పరిస్థితికి వచ్చామన్నారు. వాజ్‌పేయి చేసిన అభివృద్ధి, చూపిన దారి, స్ఫూర్తి, పీపీపీల ద్వారా సంపదను సృష్టించారని.. ఇప్పుడు ఏమీ తెలియని నాయకులు పీపీపీ గురించి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మెరుగైన సేవలు అందించాలన్నా.. సంపద సృష్టించాలన్నా.. ఉద్యోగాలు కల్పించాలన్నా.. పీపీపీ మోడల్ కరెక్ట్ అని అందరం చూశామన్నారు.

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నగరంలో క్రిస్మస్ వేడు కలు ఘనంగా జరి గాయి. వన్‌టౌన్‌లోని సెయింట్ జాన్స్, కోర్టు సమీపంలోని పునీత ఆంథోనీ చర్చి, గవర్నర్ బంగ్లా సమీపంలోని పాల్స్ చర్చి, తాటిచెట్ల పాలెంలో గల లూర్డు మాత దేవాలయం, జగదాంబ జంక్షన్ సమీపంలోని ట్రినిటి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు యేసు క్రీస్తు జనన విధాన యొక్క అర్థాన్ని, దేవుని ప్రేమను వివరించారు. అధికసంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

## ఉక్కులో మరోసారి వీఆర్ఎస్!



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** స్టీల్ ప్లాంటు మరోసారి వలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ (వీఆర్ఎస్)ను ప్రకటించింది. ప్లాంటులో ఉన్న మానవ వనరుల రేషనలైజేషన్, సమర్థ వినియోగం, వ్యయాలను నియంత్రించి ఉత్పత్తి పెంచుకోవాలనే ఆలోచనతో వీఆర్ఎస్‌ను అమలు చేస్తున్నట్టు పేర్కొంది. ఈ ఏడాది ప్రారంభంలో మొదటిసారి వీఆర్ఎస్ ప్రకటించినప్పుడు 1,146 మంది సంస్థ ఇచ్చిన డబ్బులు తీసుకొని వెళ్లిపోయారు. జూన్ నెలలో రెండోసారి వీఆర్ఎస్ ప్రకటించినప్పుడు ఇంకో 487 మంది ముందుకొచ్చారు. మొదటి విడత వీఆర్ఎస్ తీసుకున్న అందరికీ ఫుల్ సెటిల్‌మెంట్ చేయగా, రెండోసారి వీఆర్ఎస్ తీసుకున్నవారికి 50 శాతమే ప్యాకేజీ ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, మిగిలిన మొత్తాలు తరువాత ఇస్తామని చెప్పి ఆరు నెలలైనా ఇప్పటివరకూ బకాయిలు ఇవ్వలేదు. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ డబ్బులు కూడా చెల్లించలేదు. ఉద్యోగులు అందరికీ మూడున్నర నెలల జీతం బకాయి పెట్టారు. నెల నెలా జీతాలు అందనందున వీఆర్ఎస్ తీసుకుని, ఆ డబ్బుతో ఏదో ఒకటి చేసుకుందామని అనుకుంటే అవి కూడా పూర్తిగా ఇవ్వకుండా ప్రస్తుత యాజమాన్యం వేధిస్తోందని ఉద్యోగులు వాపోతున్నారు. ఇది చట్ట విరుద్ధమని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. చేతిలో డబ్బులు లేవంటున్న యాజమాన్యం వీఆర్ఎస్ ప్రకటన ఎలా ఇస్తుందని ప్రశ్నిస్తున్నాయి. ఈసారి మరో 570 మందికి వీఆర్ఎస్ ఇవ్వాలని ప్రణాళిక రూపొందించినట్టు సమాచారం.స్టీల్ ప్లాంటు యాజమాన్యం నిర్ణయాలు కార్మిక వర్గాలను తీవ్ర విస్మయానికి గురిచేస్తున్నాయి. కేంద్రం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అందించిన సాయంతో ప్లాంటును లాభాల బాటలోకి తీసుకువస్తామని ప్రకటించిన యాజమాన్యం అందుకు విరుద్ధంగా చర్యలు చేపడుతోంది. గత నాలుగేళ్ల నుంచి నియామకాలు లేవు. పదోన్నతులు ఇవ్వడం లేదు. హెచ్ఆర్ఏ కోత పెట్టారు. మూడున్నర నెలల జీతాలు బకాయిలు పెట్టారు. ఇప్పుడు ఉత్పత్తి ఆధారిత జీతాలు అంటూ 20 శాతం తగ్గించి ఇస్తున్నారు. ఉద్యోగులు ప్లాంటు వదిలి వెళ్లిపోయే పరిస్థితులు తీసుకువచ్చారు. ప్రతి నెలా సగటున 50 మంది పదవీ విరమణ చేస్తున్నారు. ఈ ఏడాది రెండు విడతలుగా వలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ (వీఆర్ఎస్) ప్రకటించి సుమారు 1,500 మందిని ఇంటికి పంపించేశారు. ఉద్యోగుల సంఖ్య భారీగా తగ్గిపోయింది. ఒకప్పుడు 14 వేలు ఉండే ఉద్యోగుల సంఖ్య ఇప్పుడు 9,385కి పడిపోయింది. ఎగ్జిక్యూటివ్‌లు 2,819 మంది, నాన్ ఎగ్జిక్యూటివ్‌లు 6,566 మంది కలిపి 9,385 మంది శాశ్వత ఉద్యోగులు ఉన్నారు. వీరిలో మరో 570 మందిని మూడో విడత వీఆర్ఎస్ ద్వారా తీసేయాలని ప్రణాళిక రూపొందించారు. అదేవిధంగా కాంట్రాక్టు వర్కర్లను ఐదు వేలకు తొలగించారు. మరో వైపు మూడు బ్లాస్ట్ ఫర్నేసుల ద్వారా 92 శాతం ఉత్పత్తి చేయాలని ఒత్తిడి పెడుతున్నారు. ఏ మాత్రం ఉత్పత్తి తగ్గినా ఉద్యోగులు పనిచేయడం లేదని ప్రచారం చేస్తున్నారు. యంత్రాల మరమ్మతులు, నిర్వహణ పనులు గాలికి వదిలేశారు. దానివల్ల ఏ ప్రమాదం జరిగినా దానికి ఉద్యోగులే కారణమని పోలీసులకు ఫిర్యాదు చేసే కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఉత్పత్తి వ్యయం తగ్గించడానికి ప్రయత్నిస్తున్నామని చెబుతూ పెల్లెట్లను లక్షలాది టన్నులు బయట కొంటున్నారు. కోక్ కూడా నాణ్యమైనది రావడం లేదు. దాంతో ఉత్పత్తుల్లో నాణ్యత లోపిస్తోంది.

## పేద మహిళలకు చీరలు పంపిణీ

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** సుపరిపాలన మార్గదర్శి వాజ్ పాయ్ శతజయంతి పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ దక్షిణ నియోజకవర్గం, శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, ప్రకృతి చికిత్సలయము సంయుక్త నిర్వహణలో మహారాణిపేట అఫీషియల్ కాలనీలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ముందుగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళు లర్పించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం జీవీఎంసీ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్



పుణ్యవతిని శాలువా కప్పి వాజ్‌పేయిమెమొంటో ఇచ్చి ఆమె సేవలను కొనియాడుతూ ఘనంగా సత్కరించారు.వంశీకృష్ణ శ్రీనివాస్‌మాట్లాడుతూ వాజ్పాయ్ ప్రధానిగా దేశ ప్రగతికి క ృషి చేశారని, నదుల అనుసంధానము, గ్రామీణ సడక్ యోజన, స్వర్ణ చతుర్భుజీ, అభివ ృద్ధికి క ృషి చేశారని, పోక్రాన్ అణు పరీక్షలు , నిర్వహించి దేశ శక్తిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు బిజెపి మైనార్టీ మోర్చా నేత ఓలుగంటి ఆల్బర్ట్, బిజెపి నేతలు రాష్ట్ర వైద్య విభాగ కన్వీనర్ రూపాకుల రవికుమార్, ఉప్పాడ అప్పారావు, రామ్ కుమార్, సిహెచ్ రాజబాబు, సూరాడ రాజు, పావని, మున్నా, ఓ .కిరణ్, కళ్యాణి, మొదలగు వారు పాల్గొన్నారు.

## వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, భారతీయ జనతా పార్టీ, ప్రకృతి చికిత్సలయము, మహారాణి పేట, సంయుక్త నిర్వహణలో నేచర్ క్యూర్ హాస్పిటల్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎస్ లక్ష్మీనారాయణ ముందుగా వాజ్పాయ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రోగులకు పండ్లు, బిస్కెట్స్, స్వీట్స్ పంపిణీ చేశారు. వారు ప్రసంగిస్తూ స్వర్ణ చతుర్భుజి, నదుల అనుసంధాన కర్త, గ్రామీణ సడక్ యోజన రూపకర్త, సర్వ శిక్ష అభియాన్ రూప శిల్పి, పోక్రాన్ పరీక్షలు నిర్వహించి దేశశక్తిని, అభివృద్ధిని ప్రజ్వలింప చేసిన నేత అని అన్నారు. విద్యార్థులు స్కూల్ స్థాయి నుంచి, దేశభక్తిని, కలిగి ఉండాలని ,విద్య పట్ల అంకిత భావముతో మెలగాని అన్నారు.విశాఖ నగర బిజెపి ఉపాధ్యక్షురాలు తలాడ గిరిజ ప్రసంగిస్తూ ఉత్తమ పార్లమెంటేరియన్ గా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, కవిగా, దేశ ప్రధానిగా సేవలందించారని కొని ఆడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ శ్రీలక్ష్మి, రూపాకుల రవికుమార్, కన్వీనర్ భారతీయ జనతా పార్టీ వైద్య విభాగం ఆంధ్ర ప్రదేశ్ , పల్లా చలపతిరావు, ఎస్ పూజిత, ఎస్ క్షీరాబ్దిదుతి భారతీయ జనతా పార్టీ ప్రతినిధులు పల్లా సాయి, దశ మంతుల శ్రీనివాస్, సుశీల, రమ, సూర్యారావు, సాయి, బెంగాల్ రాష్ట్ర బిజెపి ప్రతినిధులు సంఘమిత్ర మిశ్రా, పవిత్ర మిశ్రా, అమితాబ్ మిశ్రా, రమణ, కొండమ్మ, బంగారమ్మ పాల్గొని వాజ్పాయ్ గారికి ఘన నివాళులు అర్పించారు. రోగులకు పండ్లు, స్వీట్స్, బిస్కెట్స్ పంపిణీ చేశారు.

## శ్రీ వారి ఆలయానికి సీసీ రోడ్డు నిర్మాణం



**పరవాడ, పతాకం న్యూస్:** పరవాడ మండలం, ఈ.బోనంగి ఫార్మాసిటీ పునరావాస కాలనీ సంజీవ పర్వతంపై కొలువై ఉన్న ఉన్న శ్రీ శ్రీ శ్రీ భూ సమేత శ్రీ అభయ వెంకటేశ్వర స్వామి వారి ఆలయమునకు సిసి రోడ్డు నిర్మాణ పనులు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా జనసేన మండలాలు ఇన్చార్జి పంచకర్ల ప్రసాద్ పాల్గొని సిసి రోడ్డు నిర్మాణ పనులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయాన్ని జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు తమ సొంత నిధులు నుండి సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు పైలా జగన్నాథరావు, మాజీ ఎంపీపీ సభ్యులు మాసవరపు అప్పలనాయుడు, ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల ముత్యాలు, మాజీ మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా , జనసేన మండల పార్టీ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాస్ కాసులు, గొర్లివానిపాలెం ఎంపీటీసీ గొర్లి ఎరుకునాయుడు , రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, సీనియర్ నాయకులు బొద్దపు రమణ, మాజీ సర్పంచ్ అట్టా సన్యాసి అప్పారావు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి, ఆలయ కమిటీ చైర్మన్ బుగిడి రామ గోవిందరావు, మండల ఉపాధ్యక్షులు వెన్నెల నర్సింగరావు , నాయుడుపాలెం ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, పైల రామచంద్రరావు, మేడిశెట్టి బాలాజీ నాయుడు, పెద్దిశెట్టి సత్యరావు, పావని, ఈబోనంగి వైస్ సర్పంచ్ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు

## మత ఉన్మాదం,కులవాదానికి వ్యతిరేకంగా ఐక్య పోరాటం

**గొలుగొండ, పతాకం న్యూస్:** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శత వసంతాల వేడుకలను జనవరి 4న ఘనంగా నిర్వహించి జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బాలేపల్లి వెంకటరమణ పిలుపునిచ్చారు. మతం మత్తు, కులం పిచ్చి వల్ల ప్రజానీకానికి తీవ్ర నష్టం జరుగుతోందని, దీనిపై విద్యార్థులు, ప్రజా మేధావులు ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు.గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద సీపీఐ 100 సంవత్సరాల సందఠరేగా ఈనెల 26న ఆవిఠపేంచిన రోజు వేడుకలలో భాగంగా సీనియర్ నాయకులు సుర్ల శ్రీరామమూర్తి పతాకవిష్కరణ చేశారు. ఈ సందఠరేగా వెంకటరమణ మాట్లాడుతూ సీపీఐ ఎర్రజెండా సుదీఠ పోరాటాల ఫలితంగా శ్రామిక వర్గాలకు కొంత మేర ప్రయోజనం చేకూరిందన్నారు.

## క్రమంగా నిత్యావసర సరుకుల పంపిణీ



**పాడేరు, పతాకం న్యూస్:** జిల్లాలో నిత్యావసర సరుకుల పంపిణీ ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని అధికారులను ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ శ్రీపూజ ఆదేశించారు. పౌర సరఫరాల సంబంధిత, అనుబంధ శాఖల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. గోదాముల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు నిత్యావసర సరుకులను సకాలంలో సక్రమంగా అందించాలన్నారు. నిర్ణీత సమయానికి వాటిని పక్కాగా అందించాలని, ఈ క్రమంలో అలక్ష్యంగా వ్యవహరించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాలల్లో ఆహార నాణ్యతపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సక్రమంగా మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. ఇకపై అటువంటి ఫిర్యాదులు వస్తే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. అలాగే వంట గదుల్లో, భోజన శాలల్లో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని, అపరిశుభ్రంగా ఉంటే ఒప్పుకొనేది లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను నిత్యం సీడీపీవోలు, ఎంఈవోలు పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందేలా చూడాలన్నారు. సరుకుల నిల్వలపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, గుడ్లు, బాలామృతం గడువు ముగిసినవి, నాసిరకం ఉండకూడదన్నారు. పాఠశాలల్లో సక్రమంగా భోజనాలు పెట్టని ఏజెన్సీలను రద్దు చేస్తామని, అధికారుల పర్యవేక్షణ మరింతగా పెరగాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ మోహన్‌బాబు, డిప్యూటీ తహశీల్దార్ ప్రశాంత్, జిల్లా విద్యాశాఖాధికారి రామకృష్ణారావు, గిరిజన సంక్షేమ శాఖ డీడీ పరిమిళ, జీసీసీ డివిజన్, బ్రాంచి మేనేజర్, ఎంఈవోలు, ఏటీడబ్ల్యూవోలు, సివిల్ సప్లై గోదాముల ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

## మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు



**అరకు, పతాకం న్యూస్:** మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగడంతో చలి తీవ్రత తగ్గలేదు. జి.మాడుగులలో 4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లా కేంద్రం పాడేరుతో సహా అన్ని ప్రాంతాల్లోనూ ఉదయం పది గంటల వరకు పొగమంచు దట్టంగా అలముకుంది. చలి తీవ్రతకు జనం ఉన్ని దుస్తులు ధరిస్తూ, చలి మంటలు కాగుతున్నారు. అలాగే మన్యంలో హుకుంపేట, కొయ్యూరు మినహా మిగతా మండలాల్లో సింగిల్ డిజిట్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జి.మాడుగులలో బుధవారం 4.0, ముంచంగిపుట్టులో 6.7, అరకులోయలో 8.6, పెదబయలులో 9.0, చింతపల్లిలో 9.3, పాడేరులో 9.9, హుకుంపేటలో 10.6, కొయ్యూరులో 12.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ముంచంగిపుట్టు మండల పరిధిలో చలి బెంబేలెత్తిస్తోంది. ఉదయం పది గంటలు దాటినా మంచు తెరలు వీడడం లేదు. సాయంత్రం నాలుగు దాటితే చాలు చలి గాలులు మొదలవుతున్నాయి. బుధవారం మండల కేంద్రంతో పాటు పలు చోట్ల ఉదయం మంచు దట్టంగా కమ్ముకుంది. సాయంత్రం ఆరు గంటలు దాటితే ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ఎవరూ సాహసించడం లేదు. మండల కేంద్రంతో పాటు జోలాపుట్టు, బూసిపుట్టు, బంగారుమెట్ట, లక్ష్మీపురం ప్రాంతాల్లో జరిగే వారపు సంతల్లో ఉన్ని దుస్తులకు మంచి గిరాకీ లభిస్తుంది. హుకుంపేట మండలంలో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. ప్రధాన రహదారిపై దట్టంగా మంచు పరుచుకోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఉదయాన్నే వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు, రైతులు అవస్థలు పడ్డారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి లక్ష్యాలను సాధించాలి: సీఐ షణ్ముఖరావు



**కొత్తవలస, పతాకం న్యూస్:** విజయనగరం జిల్లా కొత్తవలస మండలం తుమ్మికాపల్లి వాగ్దేవి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రాంగణంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిధిగా కొత్తవలస సీఐ షణ్ముఖరావు హాజరై విద్యార్థులకు సందేశం అందించారు.ఈ సందర్భంగా సీఐ షణ్ముఖరావు ముందుగా విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ మంచి లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు మంచి విలువలు, సమాజంపై బాధ్యత కలిగిన పౌరులుగా ఎదగాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా వాగ్దేవి విద్యా సంస్థల కరస్పాండెంట్ కోటిన మహేశ్వరరావు మాట్లాడుతూ, వాగ్దేవి విద్యా సంస్థలు విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాయని, ఇటువంటి వేడుకలు విద్యార్థుల్లో ఐక్యత, మానవీయ విలువలను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమం లో కాలేజ్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ కళాశాల ప్రిన్సిపాల్స్ సతీష్ రాజ్ కుమార్ సురేష్ లక్ష్మణ్ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యేసు క్రీస్తు ప్రభువు స్వచ్ఛమైన ప్రేమకు ప్రతిరూపం: కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం, పతాకం న్యూస్:** యేసుక్రీస్తు ప్రభువు స్వచ్ఛమైన ప్రేమకు ప్రతిరూపమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనుల శాఖామంత్రి కొల్లు రవీంద్రవ్యాఖ్యానించారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఇవాళ(గురువారం) మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో అంగరంగ వైభవంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పలువురు క్రైస్తవులు పాల్గొని ప్రత్యేక పార్థనలు చేశారు. ఈ వేడుకలో కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు పుట్టుక జన్మదిన వేడుకలు తెలియజేస్తూ ఏర్పాటు చేసిన మందిరాన్ని సందర్శించారు. మందిరాన్ని ఏర్పాటు చేసిన పిల్లలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడారు. ప్రతి ఒక్కరినీ ప్రేమించాలని, అందరూ బాగుండాలని ఏసుప్రభువు చూపిన మార్గం అందరికీ అనుసరణీయమని చెప్పుకొచ్చారు. తన మన తారతమ్యాలు, విభేదాలు మరిచి క్రిస్మస్ పండుగను అందరూ సంతోషంగా చేసుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

క్రైస్తవ సోదరీ, సోదరీమణులకు తెలుగుదేశం పార్టీ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రపంచ మానవాళికి ఏసుక్రీస్తు జీవితం ఆదర్శమని చెప్పుకొచ్చారు. ఎల్లలులేని సంతోషాలను బహూకరించే ఉత్సవం క్రిస్మస్ అని తెలిపారు. సర్వజనులపై ఏసుక్రీస్తు కరుణాకటాక్షాలు ఉండాలని అన్నారు. లోకరక్షకుడు, కరణామయుడు అయిన క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

## సదరం ధ్రువపత్రాల రీవెరిఫికేషన్‌లో చేతివాటం



**నరసన్నపేట, పతాకం న్యూస్:** సదరం ధ్రువపత్రాల రీవెరిఫికేషన్‌లో నరసన్నపేట సామాజిక ఆసుపత్రికి చెందిన కొంతమంది సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. ఈ విషయాన్ని బాధితులు వైద్యుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఓ వైద్యుడి ఫిర్యాదుతో వైద్యఆరోగ్యశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ ఏడాది అక్టోబరు, నవంబరులో నరసన్నపేట సీహెచ్‌సీలో సదరం ధ్రువపత్రాల రీ వెరిఫికేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సమయంలో 40శాతం అంగవైకల్యం గల అభ్యర్థులను కొందరు వైద్య సిబ్బంది కలిసి రీ వెరిఫికేషన్‌లో 'మీ వైకల్య శాతం' తగ్గిపోతుందని భయపెట్టారు. డబ్బులు ఇస్తే అంగవైకల్య శాతం తగ్గకుండా చేస్తామని చెప్పారు. ఈ మేరకు కొందరి నుంచి భారీస్థాయిలో డబ్బులు గుంజారు. ఈ విషయాన్ని ఆసుపత్రిలో సదరం పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుల దృష్టికి కొందరు బాధితులు తీసుకువచ్చారు. దీంతో ఆర్థోపెడిక్ వైద్యుడు బలగ రమణరావు జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్తకు, రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ అధికారులకు సిబ్బంది చేతివాటంపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలతో బుధవారం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యరావు విచారణ చేపట్టారు. నరసన్నపేట సీహెచ్‌సీకి చెందిన రెగ్యులర్ ఉద్యోగితో పాటు ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న మరొక ఉద్యోగి, మాకివలస సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ కలసి బాధితుల నుంచి భారీస్థాయిలో డబ్బులు గుంజినట్లు విచారణలో తేలింది. సమగ్ర నివేదికను డీసీహెచ్‌కు అందజేస్తామని విచారణ అధికారి డాక్టర్ సూర్యరారావు తెలిపారు. ఈ విచారణలో ఆర్థోపెడిక్ వైద్యుడు రమణరావు తదితరులు పాల్గొన్నారు.

## గొలుగొండ ఫెయిత్ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

### వృద్ధులకు, వితంతువులకు చీరలు,దుప్పట్లు బహుకరణ




**గొలుగొండ, పతాకం న్యూస్:** గొలుగొండ మండల కేంద్రంలో ఉన్న ఫెయిత్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహ భరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. పాస్టర్ జి. నతని యేలు,పాస్టర్ జి.ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్ర ంమంలో క్రిస్మస్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. ప్రేమ,శాంతి,సేవాభావమే క్రిస్మస్ యొక్క ప్రధాన సందేశమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చర్చ్ ఆధ్వర్యంలో వృద్ధులు,వితంతువులకు చీరలు,దుప్పట్లు పంపిణీ చేసి, దేవుని ప్రేమను,మానవతా సేవలను చాటుకున్నారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు,నాటికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శాంటా క్లాజ్ వేషధారణలో చిన్నారులు, యువకులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పుల్లేటికుర్తి రమేష్,గొలుగొండ సర్పంచ్ కసిపల్లి అప్పారావు, సీనియర్ నాయకులు కుత్సం లక్ష్మినారాయణ, టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు భూపతి లోవరాజు, అంబెడ్కర్ ఇండియన్ మిషన్ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు సరమండ వీరబాబు, బొర్రా రాజుబాబు, గ్రామ టీడీపీ అధ్యక్షులు గండేపల్లి రాము తదితరులు పాల్గొన్నారు. అలాగే గొలుగొండ,కొత్తమల్లంపేట, పప్పుశెట్టిపాలెం,అమ్మపేట, గాధంపాలెం గ్రామాలకు చెందిన యువత,భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

## చిన్న గెడ్డ, కందులుగది గ్రామాల్లో క్రీస్తు జన్మదిన వేడుకలు



**చింతపల్లి, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా చింత పల్లి మండల కేంద్రంలో గురువారం క్రిస్మస్ పండుగ వేడుకలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా జరిగాయి. పర్యవేక్షకులు పి సాధుబాబు క్రీస్తు సంఘం రాజు క్యాంపుల్ శోభన్ బాబు పర్యవేక్ష ణలో ఆధ్యాత్మిక శోభ మంచు ముసుగులో క్రీస్తు జన్మదిన వేడు కలు చింతపల్లిమన్యంలో ఆధ్యా త్మిక వెలుగులు నిండాయి. ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్న క్రిస్మస్ పండుగ వేడుకలు చింతపల్లి మండలం మరియు గ్రామ పరిసరాల్లో వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేక ప్రార్థనలు: చింతపల్లిలోని ప్రధాన చర్చిలు కందుల గది చిన్న గేడ్డ గ్రామాల్లో ఉన్న ఏసుక్రీస్తు సంఘాలుమరియు ఇతర (ప్రార్థనా మందిరాలు) రంగురంగుల విద్యుత్ దీపాలతో, క్రిస్మస్ స్టార్లతో సుందరంగా ముస్తాబయ్యాయి. తెల్లవారుజాము నుండే భక్తులు కుటుంబ సమేతంగా చర్చిలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. క్రీస్తు కీర్తనల హోరు చర్చి పాస్టర్లు ఏసుక్రీస్తు జననం మరియు శాంతి సందేశాన్ని భక్తులకు వివరించారు. భక్తులు భక్తిపాటలు పాడుతూ, కేక్ కట్ చేసి ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మంచు కురుస్తున్నా తగ్గని ఉత్సాహం ఏజెన్సీలో చలి తీవ్రత విపరీతంగా ఉన్నప్పటికీ (దాదాపు 10 డిగ్రీల సెల్సియస్ గిరిజన సోదరులు మరియు స్థానికులు ఎంతో ఉత్సాహంగా వేడుకల్లో నిమగ్నమయ్యారు. పర్యాటకుల రాకతో చితపల్లి ప్రధాన రహదారులు సందడిగా మారాయి. పండుగ సందర్భంగా పలు చర్చిల ఆధ్వర్యంలో పేదలకు వస్త్రదానం మరియు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. చింతపల్లి చుట్టు పక్కల ప్రాంతాల్లో దట్టమైన మంచు కురుస్తుండటంతో పండుగ వాతావరణం పర్యాటకులకు మరియు స్థానికులకు కొత్త అనుభూతిని ఇస్తోంది. లోక రక్షకుడు ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలకు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.

## కొర్లాం పంచాయతీ విభజనకు ఒప్పుకోం



**మెరకముడిదాం, పతాకం న్యూస్:** మండలంలోని కొర్లాం పంచాయతీ విభజనకు స్థానికుల నుంచి చుక్కెదురైంది. గ్రామంలో ఏర్పాటుచేసిన గ్రామసభలో విభజన తీర్మానం వీగిపోయింది. ముగ్గురు మాత్రమే అనుకూలం ఓటేయగా 204 మంది తీర్మానాన్ని తిరస్కరించారు. కొర్లాం పంచాయతీ పరిధిలో కొత్తకర్ర, కుంచిగుమడాం, సీరియాలపేట శివారు గ్రామాలు ఉన్నాయి. అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల విభజనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో పంచాయతీలో ఎవరూ కోరకపోయినా అధికారులు పంచాయతీ విభజనను తెరపైకి తెచ్చారు. కొర్లాం నుంచి కొత్తకర్ర, కుంచి గుమడాంలను వేరుచేసి ఆ రెండింటినీ ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయతలపెట్టారు. ఈనేప?థ్యంలో బుధవారం కొర్లాం రామమందిరం వద్ద కొర్లాం, కొత్తకర్ర, సిరియాలపేట, కుంచిగుమడాం గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో గ్రామసభ ఏర్పాటుచేశారు. ప్రస్తుత సర్పంచ్ బూర్లె పార్వతమ్మతోపాటు మాజీ సర్పంచ్ బూర్లె నరేష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు జె.శ్రీనురాజు, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ పాల్గొన్నారు. నాలుగు గ్రామాల నుంచి 206 మంది హాజరయ్యారు. కార్యదర్శి వెంకటరమణ సభ ఏర్పాటుచేసి తీర్మా నం ఉద్దేశాన్ని వారికి చదివి వినిపించి ప్రజాభిప్రాయ సేకరణ కోరారు. చేతులెత్తే విధానం ద్వారా అభిప్రాయాలను తెలపాలని సూచించారు. దీంతో గ్రామసభకు హాజరైన 206 మందిలో 203 మంది విభజనకు వ్యతిరేకంగా ఓటు వేశారు. కేవలం ముగ్గురు మాత్రమే విభజనకు అనుకూలత వ్యక్తం చేశారు.

## తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ



**తిరుపతి, పతాకం న్యూస్:** తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తుతున్నారు. విద్యాసంస్థలకు సెలవులు కావడంతో భక్తుల రాక ఒక్కసారిగా పెరిగింది. అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకూ వాహనాలు బారులు తీరి కనిపించాయి. భక్తుల లగేజీ తనిఖీ కేంద్రాల నుంచి అలిపిరి లింకు బస్టాండు వరకు వాహనదారులు నిరీక్షించాల్సి వచ్చింది. సర్వదర్శన టోకెన్ల పంపిణీ కేంద్రాలైన శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులు ఉదయం నుంచే టోకెన్ల కోసం నిరీక్షించారు. కేవలం 8 వేల టోకెన్లు మాత్రమే విడుదల చేయడంతో భక్తులు నిరాశ వ్యక్తం చేశారు. 30 వేల మందికి పైగా భక్తులు సర్వదర్శనం కోసం తరలి రావడంతో టోకెన్లు పొందినవారు, లేనివారు వసతి పొందడం గగనంగా మారింది. మరోవైపు వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. స్వామివారిని వైకుంఠ ద్వార దర్శనంలో దర్శించుకోవాలని భక్తులు కోరుకుంటారు. అయితే ఈసారి టీటీడీ మొదటి మూడు రోజుల దర్శనానికి భక్తులను లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసింది. ఈ మూడు రోజులు లక్కీడిప్?లో టోకెన్లు పొందినవారికి మాత్రమే దర్శనం కల్పించనున్నారు. 2వ తేదీ నుంచి మాత్రం రూ.300తో టోకెన్లు పొందినవారు మరియు సామాన్య భక్తులు స్వామివారిని దర్శించుకోవచ్చని అధికారులు తెలిపారు. వైకుంఠ ద్వార దర్శనాల్లో తొలి 3 రోజులు రూ.300 దర్శనం, శ్రీవాణి దర్శనాలు రద్దు చేస్తున్నట్లు టీటీడీ పేర్కొంది. ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా అన్ని రకాల సిఫార్సు దర్శనాలు రద్దు చేస్తున్నట్లు తెలిపింది. వైకుంఠ ఏకాదశి రోజున 70 వేల మందికి దర్శన ఏర్పాట్లు చేయగా గంటకు 4,300 మందికి దర్శనం చేయించేందుకు ఏర్పాట్లు చేసింది. ఈ నెల 30న (వైకుంఠ ఏకాదశి) దర్శన సమయం 20 గంటలు కాగా సామాన్యులకు 15.15 గంటలు, వీఐపీలకు 4.45 గంటలు కేటాయించినట్లు టీటీడీ తెలిపింది. వైకుంఠ ఏకాదశి తొలి 3 రోజుల దర్శన టోకెన్ల కోసం 25,72,111 మంది భక్తులు రిజిస్ట్రేషన్ చేసుకోగా ఈ-డిప్ ద్వారా 1.76 లక్షల టోకెన్లను జారీ చేసినట్టు టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నెల 30న వైకుంఠ ఏకాదశి సందర్భంగా 8,71,340 మంది భక్తులు రిజిస్ట్రేషన్ చేసుకోగా ఈ-డిప్ ద్వారా 57వేల మందికి టీటీడీ టోకెన్లు కేటాయించింది. ఈ నెల 31న దర్శనానికి 8,52,404 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 64 వేల మందికి కేటాయించగా జనవరి 1న దర్శనానికి 8,48,367 మంది రిజిస్ట్రేషన్ 55 వేల మందికి టోకెన్ల కేటాయించడం జరిగింది. డిసెంబర్ 30వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు జరిగే వైకుంఠ ద్వార దర్శనాలపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ప్రచారాలను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తీవ్రంగా ఖండించారు.

## లారీ పరిశ్రమకు ఊరట



**సాలూరు, పతాకం న్యూస్:** లారీ యజమానులకు కూటమి సర్కార్ తీపి కబురు అందించింది. ఫిట్‌నెస్ చార్జీలు పెంపుదల చేయకుండా భరోసా అందించింది. ఇప్పటికే కష్టాల్లో ఉన్న లారీ పరిశ్రమకు ప్రభుత్వ తాజా నిర్ణయం ఊరటనిచ్చినట్లయ్యింది. వాస్తవంగా లారీలకు మోడల్ ఆధారంగా ఫిట్‌నెస్ , రెన్యూవల్ చార్జీలను కేంద్రప్రభుత్వం పెంచుతూ ఈ ఏడాది నవంబరు 11న నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా లారీ యాజమానులు ఆందోళన చెందారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల పెంపునకు బ్రేక్ వేయడంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాలూరు లారీ పరిశ్రమ విజయవాడ తర్వాత రెండో స్థానంలో ఉంది. ఇక్కడి వారి ఉపాధికి లారీ పరిశ్రమే దిక్కు. పట్టణంలో 3 వేలు పైబడి లారీలు, ఇతర వాహనాలున్నాయి. దాపు 23 వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. సాలూరు నియోజక వర్గంలో ఉన్న జీగి రాం జూట్ మిల్లు మూత పడిన తర్వాత పలువురు కార్మికులు కూడా లారీ పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే డీజిల్ ధర, కిరాయిలు తగ్గడం, వివిధ పన్నులు, రవాణా వ్యయం, లోడింగ్ లేకపోవడం తదితర కారణాలతో లారీ పరిశ్రమ కష్టాల్లో ఉంది. లారీలను నడపలేని పరిస్థితుల్లో ఓనర్లు ఉన్నారు. ఈ నేపథ్యంలో వయసు ఆధారంగా ఫిటెనెస్ చార్జీలు కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పర్యావరణ పరిరక్షణ కోణంలో 15 ఏళ్లు దాటిన లారీకి ఏకంగా రూ. 36 వేలు వరకు ఫిట్‌నెస్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ నిర్ణయంపై లారీ ఓనర్లు ఆందోళన చెందారు. ఫిట్‌నెస్ చార్జీలు తగ్గించకుంటే లారీలను నడపలేమని వారు తేల్చి చెప్పారు. లారీ ఓనర్ల ఆందోళనను అర్థం చేసుకున్న సీఎం చంద్రబాబు నాయుడు ఈ పెంపు నిర్ణయాన్ని తాత్కాలికంగా పక్కన బెట్టారు.

## ప్రపంచ మానవాళికి ఆదర్శం క్రీస్తు జీవితం లోక రక్షకుడు జన్మదిన వేడుకలు



**చింతపల్లి, పతాకం న్యూస్:** ముఖ్యఅతిథిగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దేశెట్టి సతీష్ పాల్గొన్నారు డిసెంబర్ 25, చింతపల్లి: స్తానిక యన్ ఆర్ టెక్ హబ్ కంప్యూటర్ ఇన్స్టిట్యూట్ మరియు కోచింగ్ సెంటర్ లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఇన్స్టిట్యూట్ నిర్వాహకులు మన్యం కవి నూనే రమేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దేశెట్టి సతీష్ పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించించి మాట్లాడారు. క్రిస్మస్ యావత్ ప్రపంచం జరుపుకునే గొప్ప పండుగ ,ఏసుక్రీస్తు బోధలు ప్రపంచ మానవాళిని సన్మార్గంలో నడపటానికి ఉపయోగపడతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనడం ఆనందంగా ఉంది అన్నారు, ఈ కార్యక్రమం నిర్వహించినందుకు మన్యం కవి ,మన వార్త రిపోర్టర్ ఇన్స్టిట్యూట్ నిర్వాహకులు నూనే రమేష్ ను అభినందించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న ప్రెస్ క్లబ్ సభ్యులు చిట్టిబాబు అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో వంజరి మేరీ, యాస్ కె వహీదా, ఇన్స్టిట్యూట్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా ఏపీ ఎన్జీవో ఎన్నికలు

**పార్వతీపురం, పతాకం న్యూస్:** పార్వతీపురం ఏపీ ఎన్జీవో కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా తొలుత నామినేషన్ ప్రక్రియ చేపట్టారు. సింగిల్ సెల్ నామినేషన్లు దాఖలు కావడంతో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్టు ఎన్నికల అధికారులు టి. శ్రీధర్‌బాబు, సురేష్ ప్రకటించారు. ఈ మేరకు జిల్లా నూతన అధ్యక్షుడిగా జీవీఆర్ఎస్ కిషోర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జి.సూర్యనారాయణ, ఉపాధ్యక్షులుగా బి.రామకృష్ణ, టి.వెంకటనాయుడు, ట్రెజరీలుగా వై.జయ ప్రకాష్, పి.సురేష్‌కుమార్ పి.పద్మ ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్.పద్మ, కార్యదర్శిగా కె.రంగాచారి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.విజయకుమార్, జాయింట్ సెక్రట రీలుగా వి.శ్రీనివాసరావు, సి.హెచ్.శంకరరావు, వి.గణపతిరావు, పి.చంద్రశేఖర్, ఎం.శ్రీధర్, రేఖావాణి ఎన్నికయ్యారు. అనంతరం వారితో ఎన్నికల పరిశీలకులు రంజిత్‌నాయుడు, విజయ నగరం జిల్లా ఎన్జీవో ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, ఆదిలక్ష్మి, జాయింట్ సెక్రటరీ ఆర్.స్వప్న తదితరులు ప్రమాణం చేయించారు.

## టాస్క్‌ఫోర్సు దాడులను వెరువని పొగాకు రైతులు



**గుంటూరు, పతాకం న్యూస్:** రైతులకు చేయూత ఇవ్వాల్సిన ప్రభుత్వమే పంటల సాగుపై నిషేధాజ్ఞలు విధిస్తోంది. ప్రభుత్వ ఉత్తర్వులను కాదని సాగు చేస్తే ఈ పైర్లను అధికారులు ధ్వంసం చేసే వరకు వెళ్తోంది. రైతుల నుంచి ప్రతిఘటన ఎదురుకావడంతో అధికారులు వెనక్కి తగ్గారు. తాము నిషేధించిన బర్లీ పొగాకును సాగు చేయవద్దంటూ యంత్రాలతో ధ్వంసం చేసినా రైతులు వెనుకంజ వేయకుండా ఈ ఏడాది కూడా నల్లబర్లీ, తెల్లబర్లీ సాగుకు ఉద్యుక్తులయ్యారు. తాము సాగు చేసిన పంటల్లో ప్రభుత్వం కొన్నింటినే కొనుగోలు చేస్తోందని, అదీకూడా పరిమితంగానే కొంటోందని, అలాంటప్పుడు తాము ఏ పంట వేసుకోవాలో ప్రభుత్వం ఎలా నిర్దేశిస్తుందని రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈ ఏడాది బర్లీ పొగాకును నిషేధిస్తూ ప్రభుత్వం ఇటీవల జిఒ నెంబరు 740 జారీ చేసింది. అయినా, గుంటూరు జిల్లా పెదనందిపాడు, ప్రత్తిపాడు మండలాల్లో రైతులు బర్లీ పొగాకు వేశారు. అధికారులు వెళ్లి ఆ పైర్లను ధ్వంసం చేశారు. నాటుతున్న పొగాకు మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. పెదనందిపాడు మండలంలో వరగాని, గోగులమూడి గ్రామాల్లో నల్లబర్లీ పొగాకు నాటుతుండగా రెవెన్యూ, పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులతో కూడిన కూడిన టాస్క్‌ఫోర్సు బృందం రైతుల నుంచి మొక్కలను స్వాధీనం చేసుకుంది. జిఒను అతిక్రమించి నల్లబర్లీ పొగాకు సాగు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. తెల్లబర్లీ పొగాకు వేసుకుంటే కచ్చితంగా బాండ్ చూపించి నాటుకోవాలని తహశీల్దార్ హేమ ప్రియ రైతులకు తేల్చి చెప్పారు. రైతులందరూ ప్రభుత్వానికి సహకరించి నల్లబర్లీ సాగును మానుకొని ప్రత్యామ్నాయ పంటలుగా మొక్కజొన్న, శనగ వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఐ.సుబ్రహ్మణ్యం సూచించారు. జిఒ నంబర్ 740ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి ఎం పద్మావతి హెచ్చరించారు. ప్రభుత్వ ఉత్తర్వులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని ఆమె తెలిపారు. నల్లబర్లీ పొగాకు సాగు చేస్తున్న వారి పేర్లను టాస్క్‌ఫోర్సు బృందానికి పంపేందుకు గ్రామ స్థాయి అధికారులతో నిఘా బృందాలను ఏర్పాటు చేశారు. అయినా, కొంతమంది రైతులు నల్లబర్లీ, తెల్లబర్లీ పొగాకు సాగుకు సిద్ధమయ్యారు. గత ఏడాది జరిగిన సాగులో ఈ ఏడాది ఇప్పటి వరకు పది శాతం వరకు జరిగినట్టు చెబుతున్నారు. ఎంత విస్తీర్ణంలో సాగు అయిందో తాము నమోదు చేయడం లేదని అధికారులు తెలిపారు. ప్రభుత్వం నిషేధించిన పంటను నమోదు చేయాల్సిన అవసరం లేదంటున్నారు. గుంటూరు జిల్లాలో గత సీజన్‌లో 14,390 ఎకరాల్లో బర్లీ పొగాకు సాగు చేశారు. 1.50 లక్షల టన్నులు పొగాకు ఉత్పత్తి అయినట్టు అంచనా. 3,280 మంది రైతులు ప్రైవేటు వ్యాపారులకు, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోగా, ఇంకా 40 వేల టన్నుల పొగాకు రైతుల వద్ద నిల్వ ఉంది. గత ఏడాది ప్రభుత్వం రైతుల వద్ద నిల్వ ఉన్న పొగాకు మొత్తం కొంటామని చెప్పినా పరిమితంగానే కొనుగోలు చేసింది. ఈ పరిస్థితుల్లో రాబోయే సీజన్‌లో తమకు మంచి ధరలు వస్తాయన్న ఆశతో కొద్దిమంది రైతులు బర్లీ పొగాకు సాగుకు సిద్ధమయ్యాయి. తెల్లబర్లీ పొగాకు కొనుగోలుకు కొంతమంది రైతులకు పొగాకు కంపెనీల వారు బాండ్లు ఇచ్చినట్లు తెలిసింది. నల్లబర్లీకి ఇంకా కంపెనీలు బాండ్లు ఇవ్వలేదని చెబుతున్నారు.

## భారీ మంచుతో విమానాల రద్దు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశ రాజధానిలో భారీ మంచు కురువడం, తక్కువ దృశ్యమానత కారణంగా విమాన కార్యకలాపాలకు అంతరాయం కలిగింది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 16 విమానాలు రద్దు చేయబడ్డాయి. వీటిలో 11 ఢిల్లీకి చేరుకోవాల్సి ఉండగా, ఐదు బయలుదేరాల్సి ఉంది. భారీ మంచు కారణంగా వందలాది విమానాలు ఆలస్యం అయ్యాయి. దృశ్యమానత అనేక కిలోమీటర్లు తగ్గింది, రన్‌వేపై కార్యకలాపాలను ప్రభావితం చేసింది. రోజుకు దాదాపు 1,300 విమానాలను నిర్వహించే ఢిల్లీ విమానాశ్రయంలో సేవల ఆలస్యం దేశంలోని ఇతర విమానాశ్రయాలను కూడా ప్రభావితం చేసింది. ప్రయాణికులు విమానాశ్రయంలో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది, దీనివల్ల తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. విమానాశ్రయంలో కార్యకలాపాలు ప్రస్తుతం సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయ లిమిటెడ్ తెలిపింది. మంచు కురుస్తున్నందున సేవలను తిరిగి షెడ్యూల్ చేస్తున్నారు. రాబోయే రోజుల్లో మంచు కురుస్తూనే ఉండే అవకాశం ఉన్నందున, ప్రయాణీకులు తమ సమయాలను నిర్ధారించుకోవడానికి విమానయాన సంస్థలతో తనిఖీ చేసుకోవాలని అధికారులు సూచించారు.

## కిలిమంజారో పర్వతంపై విషాదం.. హెలికాప్టర్ కూలి ఐదుగురి మృతి

**టాంజానియా:** టాంజానియాలోని కిలిమంజారో పర్వతంపై ఘోర హెలికాప్టర్ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. అనారోగ్యంతో బాధపడుతున్న పర్యాటకులను రక్షించేందుకు వెళ్లిన హెలికాప్టర్ బరాఫు క్యాంప్ వద్ద కూలిపోయింది. ఈ ప్రమాదంలో హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురూ మరణించినట్లు టాంజానియా సివిల్ ఏవియేషన్ అథారిటీ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. మృతుల్లో ఇద్దరు చెక్ రిపబ్లిక్ దేశానికి చెందిన పర్యాటకులు, ఒక జింబాబ్వే పైలట్, ఒక టాంజానియా డాక్టర్, మరో స్థానిక పర్వత గైడ్ ఉన్నారని పోలీసులు గుర్తించారు.ఇద్దరు చెక్ రిపబ్లిక్ పర్యాటకులకు ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో వారిని అక్కడి నుంచి తరలించేందుకు ఈ రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. టాంజానియాకు చెందిన ఒక సంస్థకు చెందిన ఎయిర్‌బస్ హెచ్-125 హెలికాప్టర్ ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నట్లు కిలిమంజారో ప్రాంతీయ పోలీస్ కమాండర్ సైమన్ మైగ్వా తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు.

# ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి..

## రూ.కోటి రివార్డు ఉన్న టాప్ లీడర్ గణేశ్ హతం



**అమరావతి, పతాకం న్యూస్:** ఒడిశాలోని కందమాల్ జిల్లాలో జరిగిన భారీ ఎన్‌టర్‌లో మావోయిస్టు కీలక నేత, కేంద్ర కమిటీ సభ్యుడు పాకా హనుమంతు అలియాస్ గణేశ్ ఉయికే హతమయ్యాడు. మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో అతడితోపాటు మరో ఐదుగురు మావోయిస్టులు మరణించారు. అందులో మహిళలు కూడా ఉన్నారు. ఈ మేరకు కేంద్ర హెూంమంత్రి అమిత్ షా పోస్ట్ చేశారు. ఒడిశా ఎన్‌కౌంటర్‌ను నక్సల్ రహిత భారతదేశం దిశగా ఒక ముఖ్యమైన మైలురాయిగా వర్ణించారు. "ఒడిశాలోని కంధమాల్‌లో జరిగిన ఒక భారీ ఆపరేషన్‌లో, కేంద్ర కమిటీ సభ్యుడు గణేశ్ ఉయికేతో సహా 6 మంది నక్సలైట్లు ఇప్పటివరకు హతమయ్యారు. ఈ కీలక విజయంతో, ఒడిశా నక్సలిజం నుండి పూర్తిగా విముక్తి పొందడానికి అంచున నిలిచింది. 2026 మార్చి 31వ తేదీలోపు నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించడానికి మేం కట్టుబడి ఉన్నాం" అని అమిత్ షా పోస్ట్ చేశారు.

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, జిల్లాలోని గుమ్మా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్టు సమాచారం అందడంతో పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఓ చోట మావోయిస్టులు ఎదురుపడగా పరస్పరం కాల్పులు చోటుచేసుకున్నాయి. అందులో పలువురు మావోలు హతమయ్యారు. మరణించిన వారిలో గణేశ్?తోపాటు రాజేశ్ తివారీ, చమ్రు, రూప ఉన్నారు. గురువారం జరిగిన భారీ ఎన్?కౌంటర్? తీవ్రవాదాన్ని అరికట్టడానికి, శాంతిని కొనసాగించడానికి నిరంతర ప్రయత్నాలను హైలైట్ చేస్తుందని ఒడిశా పోలీసులు తెలిపారు.

అయితే హనుమంతు స్వస్థలం తెలంగాణలోని నల్గొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామం అని అధికారులు తెలిపారు. అతడు కీలకమైన కేంద్ర కమిటీ సభ్యుడు అని, హనుమంతుపై రూ.1.10 కోట్ల రివార్డు ఉందని చెప్పారు. కొన్ని రోజుల క్రితం ప్రభుత్వం రివార్డు ప్రకటించిందని వెల్లడించారు. మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నాయకులలో ఒకరైన హనుమంతు నేడు హతమయ్యాడని చెప్పారు.అదే సమయంలో ఘటనాస్థలిలో ఒక రివాల్వర్, పాయింట్ 303 రైఫిల్, ఒక వాకీ-టాకీ సెట్, రెండు ఐఎన్ఎస్ఏఎస్ రైఫిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మావోయిస్టుల కోసం బలగాల గాలింపు కొనసాగుతోంది. కంధమాల్?, గంజాం జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో 20 స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్స్ (ఎస్ఓజీ) బృందాలు, రెండు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్) బృందాలు, ఒక బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) దళాలతో కూడిన 23 బృందాలు మోహరించాయి. అయితే ఇటీవల మల్కన్‌గిరిలో 22 మంది మావోయిస్టులు ఆయుధాలను విడిచిపెట్టి లొంగిపోయారు. మరోవైపు, 2026 మార్చి 31 నాటికి దేశం మావోయిస్టు రహితంగా మారుతుందని పునరుద్ఘాటించారు కేంద్ర హెూంమంత్రి అమిత్ షా. మావోయిస్టులతో ఇక ప్రభుత్వం ఎటువంటి చర్చలు జరపదని, ఆయుధాలు వదిలేసి లొంగిపోయేందుకు ముందుకు వస్తే స్వాగతిస్తామని తెలిపారు.

ఆ విధంగా లొంగిపోయిన వారందరికీ ప్రభుత్వం నుంచి అందాల్సిన వివిధ ప్రయోజనాలు అందిస్తామని పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు.మావోయిస్టులు తమతో చర్చలు జరపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారని, ఇప్పుడు వారితో మాట్లాడడానికి ఏముందని ప్రశ్నించారు. బస్తర్ అంతటా ఉన్న మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో ఆయుధాలతో శాంతికి విఘాతం కలిగించే వారికి భద్రతా దళాలు తగిన సమాధానం ఇస్తాయని మావోయిస్టులను హెచ్చరించారు.అయితే మార్చి 31, 2026 తర్వాత ఇటువంటి గ్రామాల అభివృద్ధిని మావోయిస్టులు అడ్డుకోలేరని అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ అభివృద్ధి కోసం రూ.4లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించిందని, భవిష్యత్తులో మరిన్ని నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. దేశంలో నక్సలిజం సమస్య ఎందుకు తలెత్తిందని, వారికి సైద్ధాంతిక, ఆర్థిక, చట్టపరమైన మద్దతును ఎవరు అందిస్తున్నారని ప్రశ్నించారు.

# పోలవరం అంచనా రూ.62వేల కోట్లు!



**అమరావతి, పతాకం న్యూస్:** పోలవరం ప్రాజెక్టు ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.62,000 కోట్లకు చేరుతోంది. ఇటీవల ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌కు ఈ ప్రతిపాదనలతో కూడిన లేఖ సమర్పించినట్లు తెలిసింది. అయితే రెండవ దశగా చెబుతున్నదానికి రూ.32 వేల కోట్లకు సంబంధించిన ఖర్చు ఎలా అనే అంశాలపై త్వరలో సమగ్ర నివేదిక ఇస్తామని చెప్పినట్లు సమాచారం. ప్రాజెక్టు కోసం పోలవరం ప్రాజెక్టు అథారిటీ ద్వారా ఇప్పటి వరకూ రూ.23,600 కోట్లు ఇచ్చింది. ఇంకా రూ.6600 కోట్ల వరకూ ఇవ్వాల్సి ఉంది. 2005లో రూ.10 వేల కోట్లతో ప్రతిపాదించిన ప్రాజెక్టు అంచనాలను 2010,. 2013, 2017లో సవరించారు. తాజాగా మరోసారి సవరించాలని నిర్ణయించారు. దీంతో అన్ని సవరణలతో కలిసి ప్రాజెక్టు విలువ ప్రస్తుతం రూ.62 వేల కోట్లుకు చేరింది. అదే సమయంలో పునరావాసం మాత్రం 26 శాతం మాత్రమే పూర్తయింది. అయితే అంచనాల్లో ప్రాజెక్టు పనులు పూర్తవుతున్నట్లు కనిపించినా ఆచరణలో కీలకమైన పునరావాసం పనులు నామమాత్రంగా జరుగుతున్నాయి. దాదాపు గిరిజనులను ఆ ప్రాంతం నుండి పూర్తిగా తరిమేస్తున్నారు. ప్రాజెక్టు పనులకు సంబంధించిన పోలవరం ప్రాజెక్టు అథారిటీ 2009 అంచనాలనే పరిగణనలోకి తీసుకుంది. 2018లో ప్రాజెక్టు అంచనాలను సవరించి రూ.55 వేల కోట్లకు ప్రతిపాదించారు. టిడిపి ప్రభుత్వం తామే ప్రాజెక్టు నిర్మిస్తామని కేంద్రానికి తెలిపి పనులు మొదలుపెట్టింది.

అయితే ప్రాజెక్టును 41,15 మీటర్లకు నిర్మించాలా, 45.17 మీటర్లకు నిర్మించాలనే అంశంపై అప్పటి తెలుగుదేశం, అనంతరం వైసిపి, ప్రస్తుత తెలుగు దేశం కూటమి ప్రభుత్వాలు కేంద్రానికి వేర్వేరు రూపాల్లో వివరాలు సమర్పించాయి. అధికారంలో ఉన్నప్పుడు 41.15 మీటర్లకు నిర్మిస్తామని చెప్పడం అధికారంలో లేకపోతే దాన్ని వ్యతిరేకించడం లేదా పరస్పరం నిందించుకోవడం టిడిపి, వైసిపి నాయకులకు ఆనవాయితీగా వస్తోంది. అయితే ప్రాజెక్టు ఎత్తు విషయంలో నిరంతరం వాదులాడుకున్న పాలకులు పునరావాసం విషయంలో మాత్రం గిరిజనుల పట్ల ఒకే విధంగా వ్యవహరించారు. ఇప్పుడు కొత్తగా తెలుగుదేశం పాలకులు ప్రాజెక్టు రెండోదశకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించారు. ప్రాథమిక అంచనాలు కేంద్రానికి సమర్పించారని, పూర్తి నివేదిక తయారుచేసి ఇవ్వాల్సి ఉందని తెలిసింది. కేంద్రానికి లేఖ ఇచ్చిన ప్రభుత్వం దాని బహిర్గతం చేయకపోవడం ఇప్పుడు చర్చనీయాంశం అయింది. దీనిపై అధికారులను సంప్రదించగా ప్రాథమిక అంచనాలు మాత్రమే ఇచ్చామని, పూర్తి నివేదిక వచ్చిన తరువాత అన్ని వివరాలూ వెల్లడించే అవకాశం ఉందని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం, నీరు నింపడం ఎంత ఎత్తు అన్న సంగతి ఎలావున్నా పునరావాసం మాత్రం ఒకే దశగా 45.17 మీటర్లకు లెక్కగట్టి పూర్తి చేయాలన్నది బాధితులు ముక్తకంఠంతో చెబుతున్నారు.

## సోషల్ మీడియాపై ఆర్మీ కొత్త రూల్స్.. ఇన్‌స్టా చూడొచ్చు.. కానీ షరతులు వర్తిస్తాయి!

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** భారత సైన్యం తన సోషల్ మీడియా వినియోగంపై కీలకమైన మార్పులు చేసింది. ఇకపై సైనికులు, అధికారులు ఇన్‌స్టాగ్రామ్‌ను వీక్షించడానికి, పర్యవేక్షించడానికి మాత్రమే ఉపయోగించుకోవచ్చని స్పష్టం చేసింది. అయితే, దానిలో ఎలాంటి పోస్టులు పెట్టడం, లైక్‌లు కొట్టడం లేదా కామెంట్లు చేయడం వంటి కార్యకలాపాలపై నిషేధం యథావిధిగా కొనసాగుతుందని సైనిక వర్గాలు తెలిపాయి. ఈ కొత్త ఆదేశాలను ఆర్మీలోని అన్ని యూనిట్లకు, విభాగాలకు పంపించారు. సోషల్ మీడియాలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవడానికి, సమాచారాన్ని సేకరించడానికి సైనికులకు ఇది వీలు కల్పిస్తుంది. అంతేకాకుండా తప్పుడు లేదా నకిలీ పోస్టులను గుర్తిస్తే, వాటిని సీనియర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం కూడా కల్పించారు. ఇటీవలే ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ విషయంపై మాట్లాడుతూ, నేటి ఆధునిక ప్రపంచంలో సైనికులకు స్మార్ట్‌ఫోన్ ఒక అత్యవసరమని అన్నారు. "దూరంగా విధులు నిర్వర్తించే సైనికుడు తన పిల్లల ఫీజులు కట్టాలన్నా, కుటుంబ సభ్యుల బాగోగులు తెలుసుకోవాలన్నా ఫోన్ తప్పనిసరి. అందుకే మేము వాటిని కాదనలేం" అని ఆయన వివరించారు. అదే సమయంలో సోషల్ మీడియా వినియోగంపై స్పందిస్తూ, "ప్రతిస్పందించడానికి, ప్రతిచర్యకు చాలా తేడా ఉంది. వెంటనే జవాబు ఇవ్వడం ప్రతిచర్య. ఆలోచించి, విశ్లేషించి సమాధానం ఇవ్వడం ప్రతిస్పందన. మా సైనికులు ప్రతిచర్యలో పాల్గొనవద్దు. అందుకే సోషల్ మీడియాను కేవలం చూడటానికి అనుమతిస్తున్నాం. రిటైర్ అయ్యాక రిప్లై ఇవ్వండి" అని జనరల్ ద్వివేది అన్నారు.

# ఈ ఆహార పదార్థాలు అతిగా తింటే – బాడీలో 'వాపు'నకు కారణమవుతాయట!



"వాపు" అనేది గాయం లేదా దెబ్బ తగిలినప్పుడు శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ స్పందించే సహజమైన రక్షణ వ్యవస్థ. బయటి నుంచి జరిగిన నష్టాన్ని పూడ్చుకునే క్రమంలో, దెబ్బను మాన్పుకునే ప్రక్రియలో వాపు ఒక భాగం. ఈ వాపు పైకి కనిస్తుంది. కానీ, ఇలా బయటకు కనిపించకుండా.. శరీరంలో నిశ్శబ్దంగా కణజాలాన్ని, అవయవాలను దెబ్బతీసే "వాపు" కూడా ఉంటుంది. దీన్నే 'ఇన్‌ఫ్లమేటరీ ప్రాసెస్' అంటారు.ఆధునిక ఆహారపు అలవాట్లు మనకు తెలియకుండానే శరీరంలో ఈ తరహా వాపు ప్రేరేపిస్తాయంటున్నారు నిపుణులు. దీన్ని సాధ్యమైనంత మేర తగ్గించాలని సూచిస్తున్నారు. రోజువారీ ఆహారంలో చేసే చిన్న మార్పులు వాపును తగ్గించడంలో పెద్ద మార్పును తెస్తాయని చెబుతున్నారు. ఈ క్రమంలో వాపును పెంచే ఆహారాలు, వాటికి ప్రత్యామ్నాయంగా తినాల్సిన ఫుడ్స్? వాటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం!

బిస్కెట్ల నుంచి బ్రెడ్ వరకు ప్రతిచోటా మైదా కనిపిస్తుంది. దీనిలో ఫైబర్, పోషకాలు ఉండవు. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరిగి వాపునకు దారితీస్తాయంటున్నారు నిపుణులు. అందుకే వీటికి బదులుగా ఓట్స్, బ్రౌన్ రైస్ లేదా మిల్లెట్స్ లాంటివి తీసుకోవడం మంచిదని చెబుతున్నారు. ఇవి నెమ్మదిగా శక్తిని విడుదల చేస్తాయని, శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ మార్కర్లను తగ్గిస్తాయని సూచిస్తున్నారు. మొక్కల ఆధారిత ఆహారాలు, తృణధాన్యాల్లో పాలీఫెనాల్స్ సహజంగా లభిస్తాయని, ఇవి శరీరాన్ని వాపు నుంచి రక్షిస్తాయనిఅధ్యయనం పేర్కొంది.

సోడా, కోలా, ప్యాక్ చేసిన జ్యూస్‌లు తాజాదనాన్ని ఇస్తాయి. కానీ, ఇవి శరీరంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి. ఇవి శరీరంలో సి-రియాక్టివ్ ప్రోటీన్ స్థాయిలను పెంచి వాపునకు కారణమవుతాయని అధ్యయనం పేర్కొంది. వీటికి బదులుగా స్ట్రాబెర్రీస్, బ్లూబెర్రీస్, ఆరెంజ్, చెర్రీస్ తినడం వల్ల శరీరానికి యాంటీ ఆక్సిడెంట్లు అందుతాయంటున్నారు నిపుణులు.

పకోడీలు, సమోసాలు, ఫ్రెంచ్ ఫ్రైస్ తినడానికి రుచిగా ఉంటాయి. కానీ, వీటిలో ఉండే ట్రాన్స్ ఫ్యాట్స్ శరీరంలో వాపును ప్రేరేపిస్తాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ఆలివ్ ఆయిల్ ఉపయోగించి ఎయిర్-ఫ్రై చేసిన లేదా వేయించిన పదార్థాలను ఎంచుకోవడం వల్ల వాపు ప్రమాదాన్ని తగ్గించవచ్చని అధ్యయనం పేర్కొంది. సాసేజ్‌లు, సలామీ వంటి వాటిలో నైట్రేట్స్ వంటి ప్రిజర్వేటివ్స్ ఉంటాయి. ఇవి వాపును ప్రేరేపిస్తాయంటున్నారు నిపుణులు. వీటికి బదులుగా ప్రొటీన్లు అధికంగా ఉండే పప్పులు, బీన్స్, శనగలు వంటివి తీసుకోవాలంటున్నారు. వీటిలో ఉండే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు సహజంగా వాపును తగ్గిస్తాయని పేర్కొంటున్నారు.

మితంగా పాలు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. కానీ, అధికంగా జున్ను, క్రీమ్ వంటివి తీసుకోవడం వల్ల కొంతమందిలో వాపు పెరుగుతుందంటున్నారు నిపుణులు. అందుకే బాదం లేదా జీడిపప్పు పాలు లేదా సోయా పెరుగు వంటివి తీసుకోవడం వల్ల ఆహారం రుచిగా ఉండటమే కాకుండా ఆరోగ్యం కూడా బాగుంటుందని సూచిస్తున్నారు.

పేస్ట్రీలు, కుకీలు, కేకులలో హైడ్రోజనేటెడ్ నూనెలు, హై-ఫ్రక్టోజ్ కార్న్ సిరప్ ఉంటాయంటున్నారు నిపుణులు. ఇవి వాపును పెంచే ప్రధాన కారకాలని చెబుతున్నారు. వీటికి బదులుగా బెల్లం, గోధుమ పిండి, కొబ్బరి నూనె లేదా వేరుశనగ నూనె వంటి ఆరోగ్యకరమైన నూనెలను ఉపయోగించి ఇంట్లోనే స్వీట్లు తయారు చేసుకోవడం మంచిదని సలహా ఇస్తున్నారు. ఎక్కువగా రెడ్ మీట్ తీసుకోవడం, ముఖ్యంగా కాల్చిన మాంసం వల్ల శరీరంలో వాపునకు కారణమవుతుందనిఅధ్యయనం పేర్కొంది. దీనికి బదులుగా ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉండే చేపలను తీసుకోవడం వల్ల వాపు తగ్గుతుందంటున్నారు. శాఖాహారులయితే వాల్?నట్స్, అవిసె గింజలు తీసుకోవడం మేలని తెలియజేస్తున్నారు.

# చలికాలంలో చర్మానికి ఏ క్రీములు వాడాలి?



చలికాలంలో చర్మం పగలొద్దంటే హెవీ క్రీములు రాయాలనుకుంటారు కొందరు. ఎలాగూ చల్లగానే ఉంది కదా.. ఎస్‌పీఎఫ్‌తో పనేంటి? అంటారు ఇంకొందరు. వేడినీళ్లతో స్నానం చేస్తేనే చర్మం ప్రశాంతంగా ఉంటుంది అనుకుంటారు మరికొందరు. ఇలా ఎన్నెన్నో అనుకుంటూ.. ఏవేవో పాటిస్తూ ఉంటారు. అయితే.. వాటిలో చాలావరకూ అపోహలే అంటున్నారు నిపుణులు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

ఉష్ణోగ్రతలు పడిపోయే కొద్దీ వాతావరణంలో తేమ తగ్గిపోతుంది. అందుకే చలికాలంలో చర్మం పొడిబారడం, దురద లాంటి సమస్యలు ఇబ్బంది పెడుతుంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటప్పుడు తేమను అందించడమే కాకుండా, చర్మ రక్షణ పొరకి ఆరోగ్యాన్ని కూడా ఇవ్వాలంటున్నారు.

అందుకే సెరమైడ్స్ షియా బటర్, హైలురోనిక్ యాసిలున్న ప్రొడక్ట్స్‌కు ప్రాధాన్యమివ్వాలని చెబుతున్నారు. పెదాలకీ విటమిన్ ఇ, షియాబటర్ వంటివి ఉన్న లిప్‌బామ్ వాడితే మేలని సూచిస్తున్నారు. సెరామైడ్ క్రీమ్ చర్మానికి తేమను అందిస్తుందని, ఇది పొడి చర్మంపై ఉపయోగించడానికి అను కూలంగా ఉంటుందని అధ్యయనం పేర్కొంది. జిడ్డు చర్మం ఉన్నవారి ముఖం చలికాలంలో జిడ్డుగా కనిపించడమనేది పెద్దగా ఉండదు. దీనివల్ల పదే పదే ముఖాన్ని కడగాల్సిన పని ఉండదని, చర్మ పొడిబారడం అనేదే కూడా ఉండదని, దీంతో మాయిశ్చరైజర్‌తో పనిలేదని భావిస్తారు. కానీ.. ఏ చర్మం వారికైనా రక్షణ అవసరమంటున్నారు నిపుణులు. చర్మంలో తేమ తగ్గడమనేది లోతుగా కణాల నుంచీ మొదలవుతుందని, అది అందరికీ త్వరగా బయటపడదని చెబుతున్నారు. దీన్నే 'మైక్రో డ్యామేజింగ్' అని అంటున్నారు. కాబట్టే వీళ్లలో వైట్‌హెడ్స్, దద్దుర్లు వంటివి రావొచ్చని హెచ్చరిస్తున్నారు. వాటి నుంచి తప్పించుకోవాలంటే మాయిశ్చరైజర్ తప్పకుండా రాసుకోవాలని సూచిస్తున్నారు. కాకపోతే జిడ్డును పెంచని రకాలను ఎంచుకుంటే సరిపోతుందని చెబుతున్నారు. యూవీ కిరణాల ప్రభావం కేవలం వేసవికే పరిమితం కాదు. ఏడాది పొడవునా ఉంటుంది. చలిగా ఉంది, సన్‌స్క్రీన్ అనవసరం అని పక్కన పెడితే పిగ్మెంటేషన్, ముడతలు, వృద్ధాప్యఛాయల బారిన పడాల్సి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి, కాలమేదైనా దీన్ని రాయడం తప్పనిసరంటున్నారు. వాతావరణం లేదా సీజన్ ఏదైనా, ప్రతిరోజూ సన్‌స్క్రీన్ అప్లై చేయడం తప్పనిసరి అని అధ్యయనం పేర్కొంది. చలివేళ వేడినీళ్లుతో స్నానం చేస్తే కలిగే హాయే వేరు. ఓ పట్టాన స్నానం ముగించాలని అనిపించదు.

ఇది మనకి మేలు చేస్తోందని భావిస్తాం. కానీ, చర్మంలో సహజ నూనెల్ని తొలగిస్తుందంటున్నారు నిపుణులు. ఫలితంగా, చర్మం పొడిబారడం, దురద, ఎర్రబడటం వంటి సమస్యల బారిన పడతామని హెచ్చరిస్తున్నారు. అప్పుడే చర్మం ఆరోగ్యంగా ఉంటుందని తెలియజేస్తున్నారు. చుండ్రు వస్తుంది తలకి నూనె పెట్టొద్దు, జిడ్డు పట్టదు తలస్నానాలు వాయిదా వేయొచ్చని చాలామంది అనుకుంటారు. కానీ చలి ప్రభావం కురులమీదా పడుతుందంటున్నారు నిపుణులు. కాబట్టే, నిర్జీవంగా తయారవుతాయని చెబుతున్నారు. అలాగే చివర్లు చిట్లుతాయి, కురులు రాలటానికీ కారణమవుతాయని తెలియజేస్తున్నారు. అందుకే నూనె రాయడం, వారానికి రెండుసార్లు తలస్నానం తప్పనిసరిగా చేయాలని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో చలికాలం చర్మ అవసరాలు మారతాయంతే! వాటిని గమనించుకుని తగ్గట్టుగా మార్పులు చేసుకోవాలని సూచిస్తున్నారు. శీతాకాలంలో కూడా జుట్టు పొడిగా మారుతుందని అధ్యయనం పేర్కొంది. నూనె లేదా కండిషనర్‌తో తేమగా ఉంచడం వల్ల అది రక్షించబడుతుందని తెలిపింది.

# నిషేధిత భూముల సమస్యల పరిష్కారానికి చొరవ ఏదీ?




**విజయవాడ, పతాకం న్యూస్:** ఉమ్మడి కృష్ణాజిల్లాలో నిషేధిత భూములకు (22ఏ) సంబంధించి అనేక సమస్యలు ఉన్నాయి. వీటి పరిష్కారానికి ఏళ్ల తరబడి లబ్ధిదారులు ఎదురుచూస్తూనే ఉన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవడానికి ఐఏఎస్ అధికారులతో పాటు సీనియర్ తహసీల్దార్లతో కమిటీని నియమించాల్సిన అవసరం ఉంది. తహసీల్దార్ల సిఫార్సుల మేరకు క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించగలిగితేనే పరిష్కారం లభిస్తుంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో అనాధీన భూములను స్వాత ంత్ర్య సమరయోధులకు పట్టాలుగా ఇచ్చారు. 1953లో అప్పటి కలెక్టర్ పట్టాలు ఇస్తున్నట్టుగా ప్రొసీడింగ్స్ ఇచ్చారు. తర్వాత క్రమంలో ఈ భూములు చేతులు మారాయి. స్వాతంత్ర్య సమరయోధుల వార సులకు రిజిస్ట్రేషన్ కూడా చేశారు. ఇప్పుడివి నిషేధిత భూముల్లో ఉన్నాయి. ఈ తరహా 22ఏ జాబితా పరిష్కారానికి సంబంధించి ఐఏఎస్ అధికారుల ఆలోచన ఏ విధంగా ఉందంటే.. అనాధీన, అసైన్డ్ భూముల కేటాయింపునకు సంబంధించి ప్రభుత్వం జీవో ఇచ్చిందా? ఆ జీవోలో వారు ఉన్నారా? 1950 నుంచి అనుభవంలోనే ఉన్నాడా? ఎఫ్ఎంబీ ఉందా? ఆర్ఎస్ఆర్‌లో ఉందా? ఒరిజినల్ పట్టా ఉందా? దానికి సంబంధించి రికార్డు ఉందా? ఎన్ని రకాల మార్పులు జరిగాయి? వంటి వివరాలు అడుగుతున్నారు. 1983 అనంతరం తాలూకా వ్యవస్థ పోయి మండల వ్యవస్థ వచ్చిన క్రమంలో ఇలాంటి అనాధీన భూములకు సంబంధించిన రికార్డులు వరదలు, విపత్తుల్లో పోయాయి. రికార్డులు, జీవోలు లేకపోతే లబ్ధిదారులు కాకుండాపోతారా? అప్పట్లో కలెక్టర్లు ఇచ్చిన ప్రొసీడింగ్ లేఖలు ఇప్పటికీ ఉన్నాయి. ఇలాంటి అంశాలను సూక్ష్మంగా పరిశీలిస్తేనే అర్హులైన వారికి నూరుశాతం న్యాయం జరుగుతుంది. అనాధీన భూములే కాకుండా అసైన్డ్ ల్యాండ్స్ పట్టాలుగా ఇచ్చిన వాటి సమస్య కూడా దాదాపు ఇలాగే ఉంది. వీటి పరిష్కారానికీ ప్రభుత్వం చొరవ చూపించాలి.

బ్రిటీషు వారి నుంచి వచ్చిన రికార్డులు ఆ తర్వాత క్రమంలో అందుబాటులో లేకుండాపోయాయి. 75 ఏళ్లకు సంబంధించిన రికార్డులు ఇప్పుడు ఏ కార్యాలయంలోనూ పూర్తిస్థాయిలో లేవు. 1983 తర్వాత తాలూకాల నుంచి మండల వ్యవస్థలు ఏర్పడిన క్రమంలో రికార్డుల బదిలీ సక్రమంగా జరగలేదు. దీంతో గతంలో ప్రభుత్వ భూములను పేదలకు కేటాయించిన రికార్డులు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. ప్రభుత్వం జీవోలు ఇవ్వకపోయినా.. అప్పట్లో ప్రభుత్వ మౌఖిక ఆదేశాలతో పట్టాలుగా ఇచ్చినవి ఉన్నాయి. అలాగే, రికార్డులను భద్రంగా ఉంచడానికి అప్పట్లో రికార్డు రూమ్ అసిస్టెంట్లు ఉండేవారు. ఇప్పుడు చాలాచోట్ల రికార్డు అసిస్టెంట్లే లేరు. ఇలాంటపుడు రికార్డులు ఎలా భద్రంగా ఉంటాయి? లబ్ధిదారులు 40 ఏళ్లకు పైగా ఉంటున్నా కూడా హక్కుదారులు కాదంటే చట్టం కూడా ఒప్పుకొనే పరిస్థితి లేదు. వారికి యాజమాన్య హక్కులు కల్పించడం ప్రభుత్వానికి పెద్ద సమస్య కాదు. ఇప్పటికైనా లబ్ధిదారుల నుంచి వస్తున్న డిమాండ్ దృష్ట్యా ఈ సమస్యకు ముగింపు పలకాల్సిన అవసరం ఉంది.

# దేశవ్యాప్తంగా డెలివరీ వర్కర్ల సమ్మె.. ప్రధాన డిమాండ్లు ఇవే!



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ప్రముఖ ఈ-కామర్స్, ఫుడ్ డెలివరీ, హోమ్ సర్వీస్ ప్లాట్‌ఫామ్‌లకు చెందిన డెలివరీ, గిగ్ వర్కర్లు దేశవ్యాప్తంగా సమ్మె బాట పట్టారు. స్విగ్గీ, జొమాటో, జెప్టో, బ్లింకిట్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఈరోజు, ఈ నెల 31న నిరసనల్లో పాల్గొంటున్నారు. క్షీణిస్తున్న పని పరిస్థితులు, సరైన వేతనాలు లేకపోవడం, భద్రత, సామాజిక భద్రత కల్పించకపోవడాన్ని నిరసిస్తూ వారు ఈ సమ్మెకు పిలుపునిచ్చారు. పండుగల సీజన్‌లో డెలివరీ వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే తమను కంపెనీలు దోపిడీ చేస్తున్నాయని కార్మిక సంఘాలు ఆరోపించాయి. “ఎక్కువ గంటలు పనిచేయించుకోవడం, సంపాదన తగ్గిపోవడం, అశాస్త్రీయ డెలివరీ టార్గెట్లు, అకారణంగా ఐడీలను బ్లాక్ చేయడం, ఉద్యోగ భద్రత లేకపోవడం వంటి సమస్యలతో డెలివరీ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు” అని తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టీజీపీడబ్ల్యూయూ), ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్-బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ (ఐఎఫ్ఏటీ) సంయుక్త ప్రకటనలో తెలిపాయి. పారదర్శకమైన వేతన విధానం అమలు చేయడంతో పాటు, వివాదాస్పదమైన “10 నిమిషాల డెలివరీ” మోడల్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఎలాంటి విచారణ లేకుండా ఐడీలను బ్లాక్ చేయడాన్ని ఆపాలని, భద్రతా పరికరాలు అందించాలని కోరుతున్నారు. వివక్ష లేకుండా పని కేటాయించాలని, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, పెన్షన్ వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకొని, ప్లాట్‌ఫామ్ కంపెనీల కార్యకలాపాలను నియంత్రించాలని టీజీపీడబ్ల్యూయూ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ కోరారు. “కంపెనీలు కార్మికుల జీవితాలతో ఆడుకుంటూ లాభాలు ఆర్జిస్తుంటే ప్రభుత్వాలు ప్రేక్షకపాత్ర వహించవద్దు. న్యాయం, గౌరవం, జవాబుదారీతనం కోసమే ఈ సమ్మె చేస్తున్నాం” అని ఆయన స్పష్టం చేశారు.




# వన్డే క్రికెట్‌లో చరిత్ర సృష్టించిన బీహార్



వన్డే క్రికెట్‌లో బీహార్ నయా చరిత్రను లిఖించింది. 50ఓవర్లలో 574పరుగులు కొట్టిన తొలి జట్టుగా బీహార్ ఈ రికార్డును నెలకొల్పింది. విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో భాగంగా అరుణాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ(190), ఆయుష్ ఆనంద్(116), నకీబుల్ గనీ(128) కూడా శతకాలతో రాణించడంతో నిర్ణీత 50ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 574పరుగులు చేసింది. అంతకుముందు ఈ రికార్డు తమిళనాడు జట్టు పేరిట ఉండేది. ఆ జట్టు 2022లో అరుణాచల్‌ప్రదేశ్‌పై 2వికెట్ల నష్టానికి 506పరుగులు చేసి తొలుత ఈ రికార్డు నెలకొల్పింది. ఇక అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ రికార్డు ఇంగ్లండ్ పేర ఉంది. ఆ జట్టు 2022లో నెదర్లాండ్స్‌పై 50ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 498 పరుగులు చేసింది. తాజాగా బీహార్ జట్టు ఆ రెండు రికార్డులను బ్రేక్ చేసి కొత్త చరిత్రను లిఖించింది. విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో తొలిరోజే పలు రికార్డులు నమోదయ్యాయి. బీహార్ జట్టు లిస్ట్-ఎ క్రికెట్‌లో రికార్డు స్కోర్ నమోదు చేసి నయా చరిత్రను సృష్టించగా.. బీహార్ కెప్టెన్ సకిబుల్ గని కేవలం 32బంతుల్లో, జార?ండ్ ఓపెనర్ ఇషాన్ కిషన్ 33బంతుల్లోనే శతకాలు కొట్టిన బ్యాటర్లుగా రికార్డుల్లోకెక్కారు. అలాగే టీమిండియా స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, దేవదత్ పడిక్కల్‌కి తోడు 14ఏళ్ల వైభవ్ సూర్యవంశీ భారీ శతకాలతో మెరిసారు. వీరంతా ఆయా రాష్ట్రాల తరఫున విజరు హజారే వన్డే టోర్నీలో ఆడి సెంచరీలతో రాణించారు. విరాట్ కోహ్లి ఢిల్లీ తరఫున శతకం బాదగా.. రోహిత్ శర్మ(ముంబయి), ఇషాన్ కిషన్(జార?ండ్), దేవదత్ పడిక్కల్ కర్ణాటక తరఫున శతకాలతో రాణించారు. ఇక యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ రాంచీ వేదికగా అరుణాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో బీహార్ తరఫున ఆడి కేవలం 36బంతుల్లోనే శతకం పూర్తి చేసి రికార్డులకెక్కాడు. కేవలం 14 ఏళ్ల 272 రోజుల వయసులోనే పురుషుల లిస్ట్-ఏ క్రికెట్‌లో శతకం సాధించిన అతి పిన్న వయస్కుడిగా వైభవ్ ఈ రికార్డు నెలకొల్పాడు.

# విజయ్ హజారేలో కోహ్లి, రోహిత్ శతకాలు..



విజయ్ హజారే ట్రోఫీ ఆరంభం అదిరింది. రోహిత్, కోహ్లీతోపాటు పలువురు టీమిండియా బ్యాటర్లు ఆడుతుండడంతో ఫ్యాన్స్ స్టేడియాలకు క్యూ కట్టారు. అందుకు తగ్గట్టే రో-కో శతకాలతో అలరించగా.. సకీబల్ గని, ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీ వేగవంతమైన సెంచరీలతో మెరుపులు మెరిపించారు. మొత్తంగా టోర్నీలో పరుగుల వరద పారింది. ఇక, బిహార్ భారీ స్కోరుతో ప్రపంచ రికార్డును బద్దలు కొట్టింది.

రోహిత్ శర్మ (94 బంతుల్లో 18 ఫోర్లు, 9 సిక్సర్లతో 155) దుమ్మురేపడంతో.. గ్రూప్-సి మ్యాచ్‌లో ముంబై 8 వికెట్లతో సిక్కింను చిత్తు చేసింది. తొలుత సిక్కిం 50 ఓవర్లలో 236/7 స్కోరు చేసింది. ఆశిష్ థాపా (79) హాఫ్ సెంచరీ చేశాడు. శార్దూల్ 2 వికెట్లు తీశాడు. ఛేదనలో ముంబై 30.3 ఓవర్లలో 237/2 స్కోరు చేసి గెలిచింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన రోహిత్.. ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో 62 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకొన్నాడు. లిస్ట్-ఎలో తన వేగవంతమైన శతకాన్ని నమోదు చేశాడు. అయితే, రోహిత్‌ను క్రాంతి అవుట్ చేశాడు. రఘువంశీ (38)తోపాటు ముషీర్ ఖాన్ (27 నాటౌట్), సర్ఫరాజ్ (8 నాటౌట్) రాణించారు.

పదిహేనేళ్ల తర్వాత విజయ్ హజారే ట్రోఫీ బరిలోకి దిగిన విరాట్ కోహ్లీ (101 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్సర్లతో 131) సెంచరీతో చెలరేగాడు. దీంతో గ్రూప్-డి మ్యాచ్‌లో ఢిల్లీ 4 వికెట్లతో ఆంధ్రపై గెలిచింది. తొలుత ఆంధ్ర 50 ఓవర్లలో 298/8 స్కోరు చేసింది. రికీ భుయ్ (122) సెంచరీ సాధించినా.. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. సిమర్‌జీత్ సింగ్ 5 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో ఢిల్లీ 37.4 ఓవర్లలో 300/6 స్కోరు చేసి గెలిచింది. ఓపెనర్ అర్పిత్ రాణా (0)ను నితీశ్ డకౌట్ చేశాడు. దీంతో తొలి ఓవర్‌లోనే బ్యాటింగ్‌కు దిగిన కోహ్లీ.. మరో ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య (74)తో కలసి స్కోరు బోర్డును నడిపించాడు. కాగా, సెంచరీ పూర్తి చేసుకొన్న విరాట్‌ను సత్యనారాయణ రాజు అవుట్ చేశాడు. కెప్టెన్ రిషభ్ పంత్ (5) విఫలమైనా.. ఢిల్లీ అప్పటికే గెలుపునకు చేరువైంది. సెంచరీ అనంతరం సత్యనారాయణ రాజు బౌలింగ్‌లో కోహ్లీ క్యాచవుటయ్యాడు. కెరీర్‌లో రాజుకు ఇది చిరకాలం గుర్తిండి పోయేది. అయితే, కోహ్లీని అవుట్ చేయడంపై అతడి ఫ్యాన్స్ నిరాశను వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కోహ్లీని అవుట్ చేయకుండా ఉండాల్సిందంటూ రాజు ఇన్‌స్టాకు సందేశాల మీద సందేశాలు పంపారు. ‘నాటౌట్‌గా ఉంచాల్సింది.. సోదరా’ అని ఒకరు పోస్టు చేస్తే.. ‘వాళ్లు వస్తూనే ఉంటారు. 131కే అవుట్ చేశావు. అయినా బాగా ఆడావు’ అని మరొకరు రాశారు.




# శివాజీకి అనసూయ స్ట్రాంగ్ కౌంటర్



మీ సపోర్ట్ నాకు అవసరం లేదు.. నా హద్దులు నాకు టాలీవుడ్‌లో ఇటీవల చర్చనీయాంశంగా మారిన 'దండోరా' సినిమా ఈవెంట్ వివాదం మరింత ముదురుతోంది. హీరోయిన్ల దుస్తులపై నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు ఇప్పటికే తీవ్ర విమర్శలకు దారి తీయగా, తాజాగా ఆయన తనను ఉద్దేశిస్తూ చేసిన వ్యాఖ్యలకు నటి అనసూయ భరద్వాజ్ గట్టిగా బదులిచ్చారు.

"త్వరలోనే మీ రుణం తీర్చుకునే అవకాశం నాకు కూడా రావాలని కోరుకుంటున్నా" అంటూ శివాజీ చేసిన వ్యాఖ్యల పట్ల అనసూయ తీవ్రంగా స్పందించారు. దీనిపై ఆమె సోషల్ మీడియా వేదికగా వీడియో విడుదల చేసి, తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించారు. చాలా దాటుకుని వచ్చానని.. మీ సానుభూతి తనకు అవసరం లేదని చెప్పారు. తనను ఎలా కాపాడుకోవాలో తనకు తెలుసని అన్నారు.

ప్రెస్ మీట్ లో తనను బాధితుడిగా చూపించుకునే ప్రయత్నాన్ని శివాజీ చేస్తున్నారని... అది పూర్తిగా నార్సిస్టిక్ ప్రవర్తన అని వ్యాఖ్యానించారు. శివాజీ వ్యాఖ్యలను వ్యక్తిగతంగా కాకుండా... మొత్తం మహిళలపై చేసిన వ్యాఖ్యలుగా ఆమె అభివర్ణించారు.

## నా గ్లోయింగ్ స్కిన్ సీక్రెట్ అదే..

# నోరా ఫతేహి



ప్రముఖ డ్యాన్సర్, నటి నోరా ఫతేహి తన అందం, కాంతివంతమైన చర్మం వెనుక ఉన్న రహస్యాన్ని సరదాగా వెల్లడించారు. గతంలో ఆమె కపిల్ శర్మ షోలో పాల్గొన్నప్పటి వీడియో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో మళ్లీ వైరల్ అవుతోంది.

ఆ వీడియోలో కపిల్ శర్మ, "నోరా, మీ స్కిన్ ఇంత గ్లోగా ఉండటానికి ఏం తింటారు? మీ రొటీన్ ఏంటి?" అని ప్రశ్నించారు. దీనికి నోరా నవ్వుతూ, "నాదొక మంచి రొటీన్ ఉంది. నేను పాస్తా, అన్నం, పప్పు, రోటీ, ఉడికించిన బంగాళాదుంపలు తింటాను. నాకు కారు లేదు, ఆటో రిక్షాలోనే ప్రయాణిస్తాను" అని చమత్కరించారు.

తన అద్భుతమైన డ్యాన్స్ నైపుణ్యాలతో నోరా ఫతేహి భారత చిత్ర పరిశ్రమలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ముఖ్యంగా బాలీవుడ్‌లో స్పెషల్ సాంగ్స్‌తో ఆమెకు దేశవ్యాప్తంగా గుర్తింపు లభించింది. కేవలం డ్యాన్సర్‌గానే కాకుండా 'బాట్లా హౌస్', 'స్ట్రీట్ డ్యాన్సర్ 3డి', 'మడ్‌గావ్ ఎక్స్‌ప్రెస్' వంటి చిత్రాలతో నటిగానూ తనను తాను నిరూపించుకున్నారు. పలు డ్యాన్స్ రియాలిటీ షోలకు జడ్జిగా కూడా వ్యవహరించారు.

ప్రస్తుతం ఆమె రాఘవ లారెన్స్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కాంచన 4' సినిమాలో నటిస్తున్నారు. ఈ సినిమాతో నోరా దక్షిణాది ప్రేక్షకులకు మరింత చేరువ కానున్నారు.




# థియేటర్‌కు వెళ్లాలంటేనే భయమేస్తోంది: దర్శకుడు తేజ

"సినిమా టికెట్ రేటు కంటే పాప్‌కార్న్ ధర మూడు రెట్లు ఎక్కువగా ఉంది. ఈ ధరలు కచ్చితంగా తగ్గాలి. ప్రతివారం సినిమాకు వెళ్లే నేనే, ఇప్పుడు థియేటర్‌కు వెళ్లాలంటే భయపడుతున్నాను. ఎందుకంటే నేను పాప్‌కార్న్ లేకుండా సినిమా చూడలేను," అంటూ ప్రముఖ దర్శకుడు తేజ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సినిమా టికెట్ ధరల హేతుబద్ధీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశం తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సినిమా రంగ సమస్యలు, టికెట్ ధరల హేతుబద్ధీకరణపై ప్రభుత్వం నియమించిన కమిటీ బుధవారం సచివాలయంలో సమావేశమైంది. హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో సినీ పరిశ్రమ తరఫున నిర్మాత వివేక్ కూచిబొట్ల, ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అలంకార్ ప్రసాద్, దర్శకుడు తేజ, డిస్ట్రిబ్యూటర్ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు. మల్టీప్లెక్స్‌లు, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ ధరల విధానం, భారీ బడ్జెట్ చిత్రాలకు ధరల పెంపు వంటి అంశాలపై కమిటీ సినీ ప్రముఖుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించింది.

సమావేశం అనంతరం దర్శకుడు తేజ మాట్లాడుతూ.. "ప్రభుత్వం పేదలకు కూడా సినిమాను దగ్గర చేయాలని ప్రయత్నిస్తోంది. ప్రేక్షకులకు అందుబాటులో ధరలు ఉంచుతూనే, ఇండస్ట్రీలోని వారికి నష్టం రాకుండా ఎలా సమన్వయం చేయాలనే దానిపై కమిటీ మా సలహాలు కోరింది. కథ రాసిన దగ్గర్నుంచి థియేటర్ వరకు అన్ని రంగాల్లో నాకు అనుభవం ఉంది కాబట్టి, నా అభిప్రాయాలు చెప్పాను. థియేటర్లలో క్యాంటీన్ ధరలు, టికెట్



ధరలపై చర్చ జరిగింది," అని తెలిపారు.

సినిమా ఇండస్ట్రీ తరఫున తామంతా ఈ సమావేశానికి హాజరై, తమ సమస్యలు, సూచనలు (గ్రీవియన్సెస్, సజెషన్స్) తెలియజేశామని తేజ అన్నారు. తామిచ్చిన సలహాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని, త్వరలోనే దీనిపై ఒక స్పష్టమైన ప్రకటన వెలువడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**